మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 20-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 352 Issue: 352

20 జూన్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:46 సూర్యాస్తమయం - సా. 6:48 తిథి షష్ఠి మ. 3:53 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం మఖ ఉ. 9:25 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం వజ్ర మ. 12:47 వరకు కరణం తైతుల మ. 3:53 వరకు గరజి తె. 3:30౦ వరకు వర్జ్యం సా. 5:27 నుండి రా. 7:03 వరకు దుర్ముహూర్తం ఉ. 7:30 నుండి ఉ. 8:23 వరకు రాహుకాలం ఉ. 9:02 నుండి ఉ. 10:39 వరకు యమగండం మ. 1:55 నుండి మ. 3:33 వరకు గుళికాకాలం తె. 5:46 నుండి ఉ. 7:24 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:10 నుండి తె. 4:58 వరకు అమృత ఘడియలు ఉ. 7:04 నుండి ఉ. 8:38 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:43 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## పాక్‌పై ఆఫ్ఘన్ గుస్సా!

### దాయాదిపై వైమానిక దాడులు

కాబూల్: ఆఫ్ఘనిస్తాన్–పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని తమ వైమానిక దళం దాడులు చేసిందని ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈ దాడులు బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రాంతాల్లో జరిగినట్లు సమాచారం. ఈ శిబిరాలు ఐసిస్–కే కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆఫ్ఘన్ రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అక్కడి నుంచి ఆఫ్ఘన్‌పై దాడులకు ప్రణాళికలు రచిస్తున్నారని ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను పాకిస్తాన్ తీవ్రంగా ఖండించింది. ఆఫ్ఘన్ ప్రకటనలను అబద్ధాలు, దుష్ప్రచారంగా అభివర్ణించింది. గత తరువాయి 2 వ పేజీలో...




## కొట్లాట ఆపేద్దాం!

### ఇజ్రాయెల్-హిజ్బొల్లా కాల్పుల విరమణ

జెరూసలేం: పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఘర్షణలకు తాత్కాలిక ఊరట లభించినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్–హిజ్బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధికారులు వెల్లడించారు. లెబనాన్‌లో ఉద్రిక్తతలు భారీగా పెరిగిన తరువాయి 2 వ పేజీలో...

## మేం అస్సలు తగ్గం!

### రష్యాపై 500 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి



మాస్కో: ఉక్రెయిన్ చరిత్రలోనే అత్యంత భారీ డ్రోన్ దాడులతో రష్యాను గడగడలాడించింది. రాజధాని మాస్కోలోని ఆయిల్ రిఫైనరీలతో పాటు ఇతర ప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేసిన కొద్ది గంటల్లోనే నగరం మొత్తాన్ని పొగ కమ్మేసి, నల్లటి వర్షం కురిసినట్టు ఆ ప్రాంతం కనిపించింది. వందల డ్రోన్లు ఒక్కసారిగా దూసుకురావడంతో ఆకాశం నల్లగా మారిపోయిందని పేర్కొన్నాయి. ఈ దాడులతో తరువాయి 2 వ పేజీలో...




## కిండర్‌జాయ్.. కల్లివెల్లి!

సఫోలా, బికనీర్‌వాలాలూ
షుగర్ లేదని అమ్మకాలా?
తప్పుడు ప్రకటనలతో మోసాలా?
ఎఫ్ఎస్ఎస్ఏఐ తీవ్ర ఆగ్రహం
పలు కంపెనీలకు నోటీసులు

న్యూఢిల్లీ: వినియోగదారులను తప్పుదోవ పట్టించే ప్రకటనలు, తప్పుడు లేబులింగ్, నాణ్యతా లోపాలపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కిండర్ జాయ్, సఫోలా, బికనీర్‌వాలా వంటి తరువాయి 2 వ పేజీలో...



## ఫుట్‌పాత్ నడక.. ప్రాథమిక హక్కు

చక్రాల కన్నా ముందే మనిషి నడక
వాహనాల కన్నా నడకకే అధిక హక్కు
సుప్రీం కోర్టు సంచలన తీర్పు
స్కూల్‌కు వెళ్తున్న చిన్నారిని ఢీకొట్టిన లారీ
ఫుట్‌పాత్‌లు లేకపోవడంతోనే ఘటన



రహదారుల పక్కన కేటాయించిన ఫుట్‌పాత్‌లపై నడవడం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రహదారులపై వాహనాల రాకపోకల కంటే.. నడిచే హక్కుకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని వ్యాఖ్యానించింది.


న్యూఢిల్లీ: భారత భూభాగంలో ఎక్కడైనా పౌరుడు స్వేచ్ఛగా తిరిగే హక్కును కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)(డీ)లో భాగంగా ఈ నడిచే హక్కు కూడా ఉంటుందని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 19 (1)(ఏ) తరువాయి 2 వ పేజీలో...

## బాపూ బొమ్మకు రక్షణ

### గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

83 ఎకరాల రక్షణ శాఖ భూముల్లో ఏర్పాటు
కేంద్రం, సైన్యానికి సీఎం రేవంత్ ధన్యవాదాలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 19 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. కలల ప్రాజెక్టు అయిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిపాదనలు చేసింది. అయితే అక్కడ రక్షణ శాఖ భూములు ఉండటంతో.. సందిగ్ధత నెలకొంది. దీనికి సంబంధించి.. రక్షణ శాఖ భూములను బదలాయింపు కోసం తెలంగాణ ప్రభుత్వం.. కేంద్ర రక్షణ శాఖకు విజ్ఞప్తి చేయగా.. తాజాగా దానికి అనుమతులు మంజూరు చేశారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు, రక్షణ శాఖకు, భారత సైన్యానికి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లోని మూసీ నది ఒడ్డున బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా.. తాజాగా దానికి కేంద్ర రక్షణ శాఖ నుంచి అనుమతి మంజూరు అయ్యాయి. మూసీ తరువాయి 2 వ పేజీలో...






బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,137 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,248 |



## దేశానికి ఒక్క గోల్డ్ మెడల్ రాలే!

తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌కు పంపిస్తం
అందుకే స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభిస్తున్నం
బ్లూ కాలర్ జాబ్స్ కోసం స్కిల్ వర్సిటీ కూడా
ఎల్బీ స్టేడియం సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 19 (ఈవార్తలు): 140 కోట్లమంది ఉన్న దేశంలో ఒలింపిక్స్ లో గోల్డ్ మెడల్ రావడం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది కచ్చితంగా పాలకుల వైఫల్యమేనని చెప్పారు. అందుకే తాము తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామని, దీనిద్వారా ఒలింపిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో విద్యార్థులకు యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్లను గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో తరువాయి 2 వ పేజీలో...



## పవన్ జెండా ఎత్తిండు!

### జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభం.. పార్టీ జెండా ఆవిష్కరించిన పార్టీ చీఫ్

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో ఘనవిజయం సాధించి, కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది.

హైదరాబాద్, జూన్ 19 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మణికొండ (మల్కం చెరువు సమీపంలో) నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



అమెరికాలో డేటింగ్ చేయకుండా సింగిల్‌గా ఉంటున్న వాళ్లలో సుమారు 47 శాతం మంది డేటింగ్‌లో కృత్రిమ మేధ డేంజర్ అని ఫీలవుతున్నారు. డేటింగ్ యాప్‌లు ఉపయోగించే వారిలో చాలామంది తమ ప్రొఫైల్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం, అలాగే సంభాషణలను ప్రారంభించేందుకు సూచనలు ఇవ్వడంలో ఏఐ సహాయాన్ని కోరుతున్నారు.

## బంగారం.. రెండు లచ్చలు!

### ఆర్నెల్లలో భారీగా పెరగనున్న పసిడి ధర.. జేపీ మోర్గాన్ సంచలన నివేదిక

బంగారం ధరలు భవిష్యత్తులో ఊహించని రీతిలో 40 శాతం మేర బంగారం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. ప్రముఖ అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ జేపీ మోర్గాన్ తాజా నివేదిక ప్రకారం.. పశ్చిమాసియాలో ఇటీవల చోటుచేసుకున్న పరిస్థితులు అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలపై ఒత్తిడిని తెచ్చి ధరలు భారీగా పడిపోవడానికి దారితీసినట్లు జేపీ మోర్గాన్ నివేదికలో విశ్లేషించింది.



న్యూఢిల్లీ: 2026లో పసిడి మార్కెట్ పై ఇరాన్ యుద్ధం, అనుబంధ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రభావం ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి నెలాఖరు నుంచి పరిశీలిస్తే అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 20 శాతం కంటే ఎక్కువగా పతనమైనట్లు పేర్కొంది. అమెరికా , ఇజ్రాయెల్ దేశాల మధ్య తరువాయి 2 వ పేజీలో...




అమెరికా – ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం తర్వాత ప్రపంచ మార్కెట్లు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నాయి. ఇన్నాళ్లపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థని కుదేలు చేసిన ఈ యుద్ధం ఓ కొలిక్కి వచ్చింది. ఈ తాత్కాలిక ఒప్పందంద తర్వాత ప్రపంచ మార్కెట్లలో చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. హోర్మూజ్ జలసంధి నుంచి చమురు రవాణా ప్రారంభం కావడంతో సరఫరా పెరుగుతుందనే అంచనాలు కనిపిస్తున్నాయి.

## ఇరాన్ డీల్.. ఆయిల్ రేట్లు ఢమాల్

### పడిపోయిన చమురు ధరలు

హోర్మూజ్ తెరుచుకోవడంతో బూస్ట్

టెహ్రాన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన కొన్ని గంటల్లోనే చమురు ట్యాంకర్లు హోర్మూజ్ జలసంధి నుంచి ప్రయాణం చేయడం ప్రారంభించాయి. అత్యధికంగా సౌదీ అరేబియాకు చెందిన మూడు ట్యాంకర్లు.. దాదాపు 60 లక్షల బ్యారెళ్ల ముడి చమురు రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. దాంతో శుక్రవారం ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 54 సెంట్లు తగ్గి 78.31 డాలర్లకు చేరింది. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 46 సెంట్లు పడిపోయి -2 వ పేజీలో...




## టెలిగ్రామ్‌పై బ్యాన్ కరెక్టే

### ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్‌కి ముందు పేపర్ లీక్‌ను అరికట్టేందుకు కేంద్రం టెలిగ్రామ్‌పై తాత్కాలిక బ్యాన్ విధించిన సంగతి తెలిసిందే. అయితే, కేంద్రం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ ఢిల్లీ హై కోర్టును ఆశ్రయించగా.. అక్కడ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు
20.6.2026

**మేషం:** ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. పుణ్య క్షేత్ర దర్శనం చేసుకుంటారు. వ్యాపారమున ఒత్తిడి పెరుగుతుంది. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ఉదర అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. ఉద్యోగులకు స్థానచలనాలు తప్పవు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

**వృషభం:** చిన్ననాటి మిత్రుల నుండి విలువైన సమాచారం అందుతుంది. స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

**మిధునం:** వాహన వ్యాపారస్తులు నూతన లాభాలు అందుకుంటారు. కుటుంబ వాతావరణం ఆనందంగా ఉంటుంది. ఆర్థికంగా సన్నిహితుల సహాయం అందుతుంది. స్థిరాస్తి వివాదాలు తొలగి ఊరట చెందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. ఆకస్మిక ధనలబ్ధి కలుగుతుంది.

**కర్కాటకం:** వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు చికాకు కలిగిస్తాయి. ఇంటా బయట జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

**సింహం:** బంధువులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతల వలన విశ్రాంతి ఉండదు.

**కన్య:** సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగ యత్నాలలో విజయం వరిస్తుంది. స్నేహితుల నుండి ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**తుల:** కుటుంబ పెద్దల సహకారంతో కొన్ని పనులు పూర్తవుతాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. బంధుమిత్రుల నుండి కొన్ని వ్యవహారాలలో ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు.

**వృశ్చికం:** నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలను పొందుతారు. ఇంటా బయట పెద్దల ఆదరణ పెరుగుతుంది. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుంటుంది. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

**ధనస్సు:** ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పెరుగుతాయి. వ్యాపారంలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఉద్యోగుల విషయంలో అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి.

**మకరం:** ఉద్యోగ విషయమై అనుకూల మార్పులు చోటు చేసుకుంటాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వ్యాపారాల విస్తరణ ప్రయత్నములలో ఆటంకలు తొలుగుతాయి. దేవాలయ దర్శనం చేసుకుంటారు.


**కుంభం:** ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. భూ సంబంధిత వివాదాల నుంచి తెలివిగా బయటపడతారు. వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఆకస్మిక ధన లాభాలు పొందుతారు. కీలక వ్యవహారాలలో మీ కలలు నిజమవుతాయి. ఉద్యోగస్తులకు తగిన గుర్తింపు లభిస్తుంది.

**మీనం:** ప్రయాణాలు అకస్మాత్తుగా వాయిదా పడతాయి. వృధా ఖర్చులు తప్పవు. కీలక వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. కొన్ని పనులలో సన్నిహితుల నుండి నిందలు పడవలసి వస్తుంది. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగుల ప్రవర్తన చికాకు కలిగిస్తుంది.

# ఫుట్‌పాత్ నడక.. ప్రాథమిక హక్కు

మొదటి పేజీ తరువాయి

19(1)(బీ), 19(1)(సీ), భావప్రకటన స్వేచ్ఛను కల్పించే ఆర్టికల్ 21తో కలిపి చదవాలని కూడా ధర్మాసనం పేర్కొంది. 'ఒక రహదారి ఉందంటే దాని పక్కన పాదచారుల కోసం ఫుట్‌పాత్‌ను ఏర్పాటుచేసి, సక్రమంగా నిర్వహించాల్సి బాధ్యత కచ్చితంగా ఉంది.. ఇది చట్టపరంగా అమలు చేయాల్సి బాధ్యత" అని ధర్మాసనం అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఐదేళ్ల బాలుడి పరిహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా కోర్టుపై విధంగా స్పందించింది. బాలుడ్ని తన తండ్రి ఉదయం 9 గంటలప్పుడు స్కూల్‌కు నడుచుకుని తీసుకెళుతుండగా.. ట్యాంకర్ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. ఆ ప్రాంతంలో ఎటువంటి ఫుట్‌పాత్‌లు కానీ, రోడ్డు దాటడానికి క్రాసింగ్‌లు కానీ లేవు. ఈ కేసులో మృతిచెందిన బాలుడి తండ్రికి చెల్లించే పరిహారాన్ని రూ.11,44,628కు పెంచిన సుప్రీం కోర్టు.. దీనిని రెండు నెలల్లో చెల్లించాలని ఆదేశించింది. పరిహారాన్ని తగ్గిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కనబెట్టింది. "ప్రత్యేకంగా కేటాయించిన ఫుట్‌పాత్‌లపై నడిచే హక్కుకు భంగం కలిగితే.. పౌరులు తమ హక్కుల పునరుద్ధరణ, పరిహారం కోసం బాధ్యులైన అధికారులపై చట్టపరమైన పరిష్కారాలను ఆశ్రయించవచ్చు.. నష్టపరిహారం కోరవచ్చు.. అయితే ఈ పరిహారం మోటారు వాహనాల చట్టం 1988లతో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. సౌకర్యవంతమైన, సురక్షితమైన ఫుట్‌పాత్ లేకపోవడం, వాటిని వాహనాల రాకపోకల కోసం వదిలేయడం అనేది చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్య అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశంలో నగరాలు, పట్టణాల ప్రణాళికలు వాహనాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రూపొందించారని, దీనివల్ల పాదచారులు దుర్బలమైన స్థితిలో ఉన్నారని కోర్టు తెలిపింది. పట్టణాభివృద్ధి క్రమంగా మోటారు వాహనాల రాకపోకలకు ఎలా అనుకూలంగా మారిందో కోర్టు వివరించింది. చక్రాలు కనుగొనక ముందే మానవులు నడక ప్రారంభించారని, ఆర్టికల్ 19(1)(డీ) ప్రకారం సంచార హక్కు నడిచే ప్రాథమిక హక్కేనని అది వ్యాఖ్యానించింది. ఈ హక్కు వాహనాల వినియోగానికి ముందే అందుబాటులో ఉంది కాబట్టి, సురక్షితమైన, ప్రత్యేకంగా కేటాయించిన ఫుట్‌పాత్‌లను పొందే హక్కు కచ్చితంగా అంతర్భాగమై ఉంటుందని తేల్చిచెప్పింది.



# బాపూ బొమ్మకు రక్షణ

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టుకు 83 ఎకరాల రక్షణ శాఖ భూముల్లో ఆమోదం కల్పించింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధిలో ఉన్న రూ.533 కోట్ల విలువైన భూములను బదలాయించేందుకు అనుమతులు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ట్వీట్ చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం.. హైదరాబాద్‌లోని బాపూ ఘాట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులను నిర్వహించడానికి అనుమతి మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ, ఇండియన్ ఆర్మీకి సీఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంది. మూసీ నది సమగ్ర పునరుజ్జీవనం, దాని తీర ప్రాంతాన్ని హైదరాబాద్ నగర ప్రజల కోసం ఒక శక్తివంతమైన పర్యావరణ, సాంస్కృతిక, ప్రజల ఆస్తిగా మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగంగా కేంద్రం ఇచ్చిన ఈ అనుమతి ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రక్షణ శాఖ, భారత సైన్యం అందించిన సహకారం, మద్దతుకు తాము కృతజ్ఞులం అని పేర్కొన్నారు.

# కొట్లాట ఆపేద్దాం!

మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో ఈ ఒప్పందం కుదిరినట్లు సమాచారం. మధ్యవర్తిత్వంలో అమెరికా, ఖతార్ పాటు ఇరాన్ సహకారం కూడా ఉందని తెలుస్తోంది. స్థానిక సమయం ప్రకారం సాయంత్రం 4 గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినట్లు సమాచారం. కాగా, సీజ్‌ఫైర్‌కు ముందు దక్షిణ లెబనాన్‌లోని నబాతియే ప్రాంతంపై ఇజ్రాయెల్ దళాలు జరిపిన భీకర దాడుల్లో 47 మంది మరణించినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మరోవైపు హిజ్బొల్లా దాడుల్లో నలుగురు సైనికులు మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్-హిజ్బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఇది మొదటిసారి కాదు. ఇటీవలే పలు మార్లు ఇరు పక్షాలు సీజ్‌ఫైర్‌కు అంగీకరించాయి. అయినా పరస్పర దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజా ఒప్పందమైనా ఆచరణలోకి వస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# మేం అస్సలు తగ్గం!

మొదటి పేజీ తరువాయి

విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేసినట్టు అధికారులు చెప్పారు. 500లకు పైగా విమాన సర్వీసులు రద్దయినట్లు తెలిపారు. ఉక్రెయిన్ చేసిన దాడులకు ప్రతీకారంగా రష్యా కూడా ఎదురుదాడులు చేపట్టింది. ఉక్రెయిన్ నగరాలైన సుమీ, ఖార్కివ్‌లపై వైమానిక దాడులకు తెగబడింది. ఈ దాడుల్లో ఇద్దరు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఐరోపాలో పర్యటిస్తూ జీ7 దేశాధినేతలను కలిసి అదనపు సైనిక, దౌత్యపరమైన మద్దతును కోరుతున్న సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం. మరోవైపు, 'అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం'పై డిజిటల్ సంతకాలు చేసిన మర్నాడే ఈ దాడులు చోటుచేసుకున్నాయి.

# కిండర్‌జాయ్.. కల్లివెల్లి!

మొదటి పేజీ తరువాయి

పలు ప్రముఖ ఆహార వ్యాపార సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం ఈ చర్యలు తీసుకున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించింది. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ఉత్పత్తులపై చేస్తున్న మోసపూరిత ప్రచారాలను తీవ్రంగా పరిగణించినట్లు తెలిపింది. ఆహార భద్రత, ప్రమాణాల (ప్రకటనలు, క్లెయిమ్స్) నిబంధనలు-2018ను ఉల్లంఘిస్తూ పలు కంపెనీలు చేస్తున్న ప్రచారాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రశ్నించింది. ఫ్లక్ (గ్రాశ్రీబఎనిని) కంపెనీకి చెందిన మామిడి పండ్ల రసంపై 'నో యాడెడ్ షుగర్' అని లేబుల్ వేసి, పదార్థాల జాబితాలో చెరకు రసం ఉన్నట్లు చూపడాన్ని తప్పుబట్టింది. ఇది వినియోగదారులను మోసగించడమేనని పేర్కొంది. అదేవిధంగా, ఒక పనీర్ ఉత్పత్తిపై 'నేచురల్ పనీర్' అని పేర్కొనడం కూడా నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. మిశ్రమ ఆహార పదార్థాలకు 'నేచురల్' అనే పదాన్ని వాడటంపై ఉన్న నిబంధనలను ఇది ఉల్లంఘిస్తుందని తెలిపింది. ఫెర్రెరో ఇండియాకు చెందిన 'కిండర్ జాయ్' చాక్లెట్‌పై 'రిచ్ ఇన్ మిల్క్ సాలిడ్స్' అనే క్లెయిమ్‌ను, మారికో కంపెనీకి చెందిన 'సఫోలా టోటల్ హార్ట్ ప్రో' వంట నూనెకు సంబంధించిన బ్రాండింగ్, ఆరోగ్య ప్రయోజనాలపై చేస్తున్న వాదనలను ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రశ్నించింది. వీటితో పాటు గౌర్ హెల్తీ ఫుడ్ (సిల్కెన్ టోఫు), మాస్టర్‌చౌ ఫుడ్స్ ('100% నేచురల్', 'ఫ్రెష్లీ మేడ్' క్లెయిమ్స్) వంటి సంస్థలు కూడా నోటీసులు అందుకున్నాయి. మెడిజెన్ ల్యాబ్స్, నెక్సా ఇండస్ట్రీస్, రా ప్రెజరీ, కొరియన్ జిన్‌సెంగ్ ఉత్పత్తులపై చేస్తున్న ఆరోగ్య ప్రయోజనాల వాదనలకు శాస్త్రీయ ఆధారాలు లేవని, వాటికి అనుమతులు లేవని పేర్కొంది. సోషల్ మీడియా ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్యలకు దిగింది. ప్రముఖ మిఠాయిల దుకాణం 'బికనీర్‌వాలా'లో ఒక సిబ్బంది కిచెన్ ఏరియాలో ఆహారం తింటూ పరిశుభ్రతను గాలికొదిలేశారని వచ్చిన ఫిర్యాదుపై నోటీసులు జారీ చేసింది. దీనిపై తీసుకున్న చర్యలు, అంతర్గత విచారణ వివరాలను సమర్పించాలని ఆదేశించింది. అదేవిధంగా, ఐఆర్‌సీటీసీ క్యాటరింగ్ ద్వారా సరఫరా అయిన 'పరం డెయిరీ'కి చెందిన పెరుగు, రబ్రీ ఉత్పత్తులలో ఫంగస్ ఉన్నట్లు వచ్చిన ఆరోపణలపైనా నోటీసులు ఇచ్చింది. ఉత్పత్తి వివరాలు, నిల్వ పద్ధతులు, తీసుకున్న దిద్దుబాటు చర్యలను వివరించాలని కోరింది.

# పవన్ జెండా ఎత్తిండు!

మొదటి పేజీ తరువాయి

కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణ వ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఓ సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది. ఇటీవలి కాలంలో పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఓ బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు

# పాక్‌పై ఆఫ్ఘన్ గుస్సా!

మొదటి పేజీ తరువాయి

కొద్ది నెలలుగా ఇరుదేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. పలుమార్లు దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకోవడంతో వందల మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. చైనా మధ్యవర్తిత్వంతో జరిగిన శాంతి ప్రయత్నాలు ఇప్పటివరకు ఫలితాన్ని ఇవ్వలేదు. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నా ఇరు దేశాలు కయ్యానికి కాలుదువ్వుతుండటంతో మరింత ఆందోళన కలిగిస్తుంది.

# బంగారం.. రెండు లచ్చలు!

మొదటి పేజీ తరువాయి

సుదీర్ఘ ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. అమెరికన్ డాలర్ బాగా బలపడటం బంగారం, వెండి ధరలు క్షీణించేందుకు బలమైన కారణాలుగా మారాయి. చమురు ధరల పెరుగుదల వల్ల మార్కెట్లో ద్రవ్యోల్బణం ఎక్కువ అవుతుందనే భయాలు పెట్టుబడిదారుల్లో నెంకొంది. అదుపు చేయడానికి యూఎస్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను అత్యధిక స్థాయిలోనే ఉంచవచ్చని ఇన్వెస్టర్లు అంచనా వేశారు. సాధారణంగా బంగారంపై ఎలాంటి అధిక వడ్డీ రాదు. మార్కెట్లో వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నప్పుడు పెట్టుబడిదారు పసిడి వదిలి బాండ్లు , ఇతర వడ్డీని అందించే ఆర్థిక సాధనాల వైపు మొగ్గు చూపుతుంటారు. డాలర్ బలపడడం, ఫెడరల్ రిజర్వ్ కఠిన విధానాల కారణంగా కస్టమర్లు కొంత వరకు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండటం వల్ల ధరలు తగ్గాయి. ప్రపంచ సగటు బంగారం రేటు ఈ సంవత్సరం చివరి నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సుకు 6,000 డాలర్ల మార్కును తాకవచ్చని జేపీ మోర్గాన్ పేర్కొంది. 2027 సంవత్సరం ముగిసే నాటికి అంతర్జాతీయ ధర మరింత పెరిగి అవకాశం ఉంది. ఔన్సు ధర 6,300 డాలర్లు చేరుకోవచ్చని పేర్కొంది. ప్రస్తుతం మార్కెట్లో ధరల స్థాయిల నుంచి 40 శాతం వరకు పెరగవచ్చని సూచిస్తోంది. ఒకవేళ అంతర్జాతీయ మార్కెట్లో ఈ శ్రేణిని ధరలు దాటి ముందుకు వెళితే సరికొత్త రికార్డు గరిష్టంగా నిలిచిపోవచ్చని పేర్కొంది. రాబోయే కాలంలో బంగారం ధరలు అంతకంతకూ పెరిగిపోవడానికి అంతర్జాతీయంగా అనేక రకాల సానుకూల అంశాలు బలంగా దోహదపడుతున్నాయి. మార్కెట్లో ముడి చమురు ధరలు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు ద్రవ్యోల్బణ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది, దీనివల్ల సహజంగానే అమెరికన్ డాలర్ అసలైన కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గుతుంది. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేందుకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు నిల్వల కోసం బంగారాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నాయి. పసిడి ధరలకు లభిస్తున్న భారీ మద్దతు , ధరల పెరుగుదలకు అతిపెద్ద ప్రధాన కారణంగా చెప్పవ్చు. జేపీ మోర్గాన్ అంచనాలు నిజమైతే తులం బంగారం రూ. 2 లక్షల పైకి చేరుకుంటుంది.



# దేశానికి ఒక్క గోల్డ్ మెడల్ రాలే!

మొదటి పేజీ తరువాయి

కలిసి సీఎం పంపిణీ చేశారు. అక్కడ వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థినీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర బడ్జెట్ లో 8.5 శాతం నిధులు అంటే.. రూ.26,600 కోట్లు విద్యాశాఖ కోసం ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. గడిచిన పదేళ్ల పాలనలో వందేళ్ల నష్టం జరిగిందని విమర్శించారు. విద్యార్థులకు 10 ఏళ్లు డైట్ ఛార్జీలు, 16 ఏళ్లు కాస్మోటిక్ ఛార్జీలు పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే వాటి ఛార్జీలను పెంచామన్నారు. విద్య ప్రక్షాళన చేసి.. ప్రతి పేదవాడి గుండెను తట్టాలనే విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్నానన్నారు. తెలంగాణ.. భాషా ప్రయుక్త రాష్ట్రంగానో.. పాలన సౌలభ్యం కోసమో ఏర్పడిన రాష్ట్రం కాదని, 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, ఆత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ.. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖను భ్రష్టు పట్టిస్తే.. కాంగ్రెస్ సర్కారు వచ్చాక విద్యను వికాసం వైపు నడిపిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల తలరాతను మార్చేది తరగతి గదులేనని, రేపటి తెలంగాణ యువత దేశానికే ఆదర్శంగా నిలవాలంటే విద్యను ఇష్టపడి చదవాలని సూచించారు. ప్రభుత్వ విద్యే దేశానికి పునాది కావాలన్నారు. అందుకోసం ప్రభుత్వం ఏం కావాలన్నా ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే.. ఏఐతో వైట్ కాలర్ జాబ్స్ కు ఇబ్బంది ఏర్పడిందని, స్కిల్ ఉన్న బ్లూ కాలర్ జాబ్స్ కు ఏ ఇబ్బందీ లేదన్నారు. ఇందుకోసమే తెలంగాణలో ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో దేశానికే రోల్ మోడల్ గా నిలిచేలా 119 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కడుతున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ఆరుట్లలో నిర్మించి ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్లో అడ్మిషన్లన్నీ ఫుల్లయ్యాయని గుర్తుచేశారు. ప్రభుత్వ స్కూళ్లలో నో పర్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరన్నారు. గవర్నమెంట్ స్కూళ్లలో చదివినవారు ఐఏఎస్ లు, ఐపీఎస్ లుగా ఎదగాలని, తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు ఏం కావాలన్నా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం పేర్కొన్నారు.

# త్వరలో భూ సర్వే

## భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యం: పొంగులేటి



హైదరాబాద్, జూన్ 19 (ఈవార్తలు): భూ సమస్యలు, భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాల క్రమేణా భూముల విభజనలు, ఉప సంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే చేపడుతోందని తెలిపారు.

### నక్షాలు లేని 378 గ్రామాలు

భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.

### ప్రతి సర్వే నంబర్‌కు భూదార్

భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు. రీ-సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీ-సర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని తెలిపారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## వాట్సాప్‌లో పాఠశాల విద్యా సేవలు

**మస్కట్‌గా పాలపిట్ట**



హైదరాబాద్, జూన్ 19 (ఈవార్తలు): డిజిటల్ పాలనలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. విద్యాశాఖ ద్వారా అన్ని పాఠశాలల సమాచారం ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, విద్యార్థులకు అందించనున్నారు. మీసేవ సహకారంతో వాట్సాప్ ద్వారా ఇకపై స్కూల్ అప్డేట్స్ నేరుగా వారి ఫోన్ కు చేరనున్నాయి. ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సేవలను అధికారికంగా ప్రారంభించారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల విద్యకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, సేవలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను నేరుగా వాట్సాప్ ద్వారా పొందనున్నారు. విద్యా పురోగతి, పరీక్షల సమాచారం, విద్యా సామగ్రి పంపిణీ, స్కాలర్‌షిప్‌లు, పాఠశాల కార్యక్రమాలు, ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాల వంటి అంశాలపై సకాలంలో సమాచారం అందుబాటులోకి రానుంది. ఈ ప్లాట్‌ఫారమ్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖకు చెందిన ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ -మీసేవ విభాగం, పాఠశాల విద్యా శాఖతో కలిసి అభివృద్ధి చేసింది. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు, హాల్ టికెట్ల డౌన్‌లోడ్, మార్కుల మెమోలు, పరీక్షా ఫలితాలు, ఎస్ఎస్‌సీ మెమోలు, బోనఫైడ్ సర్టిఫికెట్లు, ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్లు, ఎస్ఎస్‌సీ మెమో సవరణల దరఖాస్తులు.. సేవలు పొందవచ్చు.

# ఐపీవోకు వెళ్తున్నాం

**డాక్యుమెంట్లు సెబీకి సమర్పించబోతున్నాం.. రిలయన్స్ వార్షిక సమావేశంలో ముకేశ్ అంబానీ ప్రకటన**




ముంబై: భారత టెలికాం, డిజిటల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన జియో ఇప్పుడు మరో కీలక ఘట్టానికి సిద్ధమవుతోంది. చాన్నాళ్లుగా వస్తున్న ఊహాగానాలు, పెట్టుబడిదారుల అంచనాలకు తెరదించుతూ రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ కీలక ప్రకటన చేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ 49వ వార్షిక సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ.. జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డు, డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను ఆమోదించిందని, దానిని సెబీకి సమర్పించనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడించారు. ఈ ప్రకటనతో భారత పెట్టుబడి మార్కెట్‌లో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జియో ఐపీఓకు అధికారికంగా శ్రీకారం చుట్టినట్లైంది. దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా ఇది నిలిచే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. జియో ఐపీఓ అనేది కేవలం ఒక వ్యాపార నిర్ణయం మాత్రమే కాదని, ఇది తనకు, రిలయన్స్ కుటుంబానికి, లక్షలాది వాటాదారులకు ఎంతో భావోద్వేగమైన క్షణమని ముకేశ్ అంబానీ అన్నారు. ఈ సందర్భంగా ముకేశ్ అంబానీ తన తండ్రి ధీరూబాయ్ అంబానీ వారసత్వాన్ని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి కలలుగన్న "అందరి అభివృద్ధి" అనే లక్ష్యాన్ని తాను ముందుకు తీసుకువచ్చానని, ఇప్పుడు అదే బాధ్యతను తదుపరి తరం స్వీకరిస్తోందని చెప్పారు. తన పిల్లలు ఆకాశ్, ఇషా, అనంత్ అంబానీలు జియో ఐపీఓ ప్రక్రియకు నాయకత్వం వహిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో విలువ సృష్టించే కొత్త అవకాశాలను కూడా వారే ముందుండి నడిపిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పదేళ్ల క్రితం జియో ప్రారంభమైనప్పుడు భారతదేశంలో డిజిటల్ అసమానతలను తొలగించడమే తమ లక్ష్యమని అంబానీ గుర్తుచేశారు. ఆ సమయంలో కాల్ ఛార్జీలు అధికంగా ఉండేవని, డేటా ఖరీదైనదిగా ఉండేదని, ఇంటర్నెట్ వేగం కూడా తక్కువగా ఉండేదని చెప్పారు. జియో వచ్చాక వాయిస్ కాల్స్, తక్కువ ధరలకు అధిక వేగం కలిగిన డేటా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఫలితంగా కోట్లాది భారతీయులకు డిజిటల్ జీవనశైలి చేరువైందని పేర్కొన్నారు. ప్రస్తుతం జియో దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగింది. 52.4 కోట్లకు పైగా వినియోగదారులను కలిగి ఉన్న ఈ సంస్థ, భారత టెలికాం రంగంలో అగ్రస్థానంలో ఉంది. జియో 5జీ సేవలకు 26.8 కోట్ల మంది వినియోగదారులు ఉండగా, జియో ఎయిర్‌ఫైబర్ ద్వారా 1.3 కోట్ల ఇళ్లకు కనెక్టివిటీ అందుతోంది. ఈ గణాంకాలే జియో ఎంత వేగంగా విస్తరించిందో తెలియజేస్తున్నాయి. జియో లిస్టింగ్ కేవలం ఒక వ్యాపార ప్రక్రియ మాత్రమే కాదని, భారతదేశం ప్రపంచ స్థాయి టెక్నాలజీ కంపెనీలను నిర్మించగలదని ప్రపంచానికి చూపించే అవకాశం అని ముకేశ్ అంబానీ అన్నారు. ప్రపంచ స్థాయి సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యం, విలువ కలిగిన సంస్థలను భారత్ సృష్టించగలదని జియో నిరూపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## 24 వరకు వడగాల్పులు

### ఆ వెంటనే భారీ వర్షాలు!

హైదరాబాద్, జూన్ 19 (ఈవార్తలు): తీవ్రమైన ఎండలు, వడగాల్పులతో అల్లాడిపోతున్న తెలంగాణ, పొరుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఉపశమనం కలిగించే చల్లని కబురు అందించింది. వచ్చే నాలుగైదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణతో పాటు ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, ఛత్తీస్‌గఢ్ లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో కొంతకాలంగా పొడి వాతావరణం, తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో, రుతుపవనాల రాకతో వచ్చే వారం నుంచి వర్షాలు ఊపందుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన బలమైన ఎల్ నినో ప్రభావం కారణంగా నైరుతి రుతుపవనాల గమనం సాధారణం కంటే చాలా నెమ్మదిగా సాగుతోంది. దీనివల్ల దేశవ్యాప్తంగా వర్షాలు ఆలస్యం కావడమే కాకుండా, అనేక రాష్ట్రాల్లో వర్షపాత లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఐఎండీ నివేదికల ప్రకారం దేశంలోని 741 జిల్లాల్లో 239 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కాగా, మరో 230 జిల్లాల్లో అత్యంత తీవ్రమైన వర్షపాత లోటు ఏర్పడింది. ఈ జాప్యం ఖరీఫ్ సీజన్ సాగుపై, తాగునీటి వనరులపై తీవ్ర ప్రభావం చూపుతుండటంతో అటు వ్యవసాయ రంగం, ఇటు ప్రభుత్వ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణలో రుతుపవనాలు విస్తరిస్తాయని చెబుతున్నప్పటికీ.. జూన్ 20 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణతో పాటు ఉత్తరప్రదేశ్, విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో కూడా ఈ ఎండల తీవ్రత కొనసాగనుంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఈ రుతుపవనాల సీజన్ మొత్తంలో దక్షిణాది రాష్ట్రాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తన దీర్ఘకాలిక అంచనాల్లో ఇప్పటికే స్పష్టం చేసింది.

# శ్రీధర్ బాబూ.. వెంటబడి ఓడిస్తాం

**మంత్రి దుద్దిళ్లకు కవిత వార్నింగ్**



మంథని, జూన్ 19 (ఈవార్తలు): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించిన సింగరేణి 'బాయిబాట' కార్యక్రమం తీవ్ర రాజకీయ వేడిని రగిల్చింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కార్మికులకు, మాకు మధ్య రావాలని చూస్తే ఖబడ్దార్. గతంలో చేసిన తప్పులకే నిన్ను వెంటబడి ఓడించాం. మళ్లీ అదే పునరావృతమైతే వచ్చే ఎన్నికల్లోనూ నిన్ను వెంటాడి మరీ ఓడిస్తాం" అంటూ మంత్రి శ్రీధర్ బాబుకు ఆమె మాస్ వార్నింగ్ ఇచ్చారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు అండర్‌గ్రౌండ్ మైన్‌లోకి దిగి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. నల్లబొగ్గు బావుల్లో కార్మికులు పడుతున్న కష్టాలను, ప్రాణసంకట పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక కార్మికుడు తను అనుభవిస్తున్న ఇబ్బందులను వివరిస్తుండగా కవిత తీవ్ర చలనానికి లోనై మైన్ లోపలే కంటతడి పెట్టారు. కార్మికులకు తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసానిచ్చారు. అనంతరం బొగ్గు గని వద్ద నిర్వహించిన భారీ గేట్ మీటింగ్‌లో కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థకు ప్రస్తుత ప్రభుత్వమే పెద్ద విద్రోహిగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ. 50 వేల కోట్ల బకాయిలు పెట్టడం వల్లే సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. అధికారులకు ప్రొడక్షన్ టార్గెట్లు పెంచడంపై ఉన్న శ్రద్ధ... కార్మికులకు కనీస సౌకర్యాలు, ఆధునిక పనిముట్లు కల్పించడంపై లేదని మండిపడ్డారు. "అండర్‌గ్రౌండ్ మైనింగ్‌లో మెషినరీని అప్‌గ్రేడ్ చేయడం లేదు. మ్యాన్ చైర్ మీద 45 నిమిషాల పాటు ప్రయాణించడం వల్ల కార్మికులు తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నారు. సింగరేణిలో ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి దోపిడీ వ్యవస్థ నడుస్తోంది. జేఎంఐటీ లో ఉన్న వారికి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రమోషన్లు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారు" అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సింగరేణి కార్మికులను కలవకుండా ఉండేందుకు గత నాలుగు రోజులుగా పోలీసులు ఆంక్షలు పెడుతూ అడ్డుకుంటున్నారని కవిత ఆరోపించారు. అసలు సింగరేణి పరిధిలోకి పోలీసులకు అనుమతే లేదని, గేట్ మీటింగ్‌కు వస్తే కార్మికుల జీతాలు కట్ చేస్తామని యాజమాన్యం బెదిరించడం దుర్మార్గమన్నారు. ఒక్క కార్మికుడి జీతం కట్ చేసినా తాను ఇక్కడే గని ముందే ధర్నాకు కూర్చుంటానని హెచ్చరించారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# 25 నుంచి 'సర్' సర్వే

**ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సన్నాహాలు**

**25 ఏళ్ల తర్వాత జరుగుతున్న అతిపెద్ద కసరత్తు**

**సన్నద్ధతపై అధికారులతో సీఈఓ సుదర్శన్ రెడ్డి సమీక్ష**

హైదరాబాద్, జూన్ 19 (ఈవార్తలు): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. సుమారు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) – 2026' కార్యక్రమాన్ని జూన్ 25 నుంచి చేపట్టనున్నారు. ఈ కార్యక్రమ సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌ఓలు), అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు), ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని ధృవీకరిస్తారు. నకిలీ, మరణించిన మరియు చిరునామా మారిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 35,000 మందికి పైగా బీఎల్‌ఓలు, దాదాపు 26,000 మంది బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించనున్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా ప్రామాణికంగా తీసుకుని తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఈ సర్వేలో సమగ్రంగా పరిశీలించనున్నారు.

## 26 నుంచి మూడ్రోజులు రిజిస్ట్రేషన్లు బంద్

హైదరాబాద్, జూన్ 19 (ఈవార్తలు): తెలంగాణవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఇతర అనుబంధ ఆన్‌లైన్ సేవలు మూడు రోజుల పాటు నిలిచిపోనున్నాయి. సర్వర్ల నిర్వహణ, అప్‌గ్రేడేషన్ పనుల కారణంగా జూన్ 26 నుంచి 28వ తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉండవని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పష్టం చేసింది. దాదాపు ఐదేళ్ల తర్వాత చేపడుతున్న ఈ కీలకమైన నిర్వహణ పనుల ద్వారా సర్వర్ల పనితీరును, భద్రతను మరింత మెరుగుపరచనున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత వేగవంతమైన, సులభతరమైన సేవలు అందించడమే ఈ అప్‌గ్రేడేషన్ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు.

# ఇస్తాంబుల్‌లో అదృశ్యమైన యువతి సురక్షితం

మేడ్చల్, జూన్ 19 (ఈవార్తలు): టర్కీలోని ఇస్తాంబుల్ విమానాశ్రయంలో అదృశ్యమైన తెలంగాణ యువతి బొక్క రాజశ్రీ సురక్షితంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గత కొన్ని రోజులుగా తీవ్ర ఆందోళనలో ఉన్న ఆమె కుటుంబ సభ్యులు, రాజశ్రీ ఆచూకీ లభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన రాజశ్రీ, అమెరికాలోని హ్యూస్టన్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 14న ఇస్తాంబుల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆమె, అక్కడి నుంచి మరో విమానం ఎక్కాల్సి ఉంది. అయితే, హ్యూస్టన్‌లో విమానం ఎక్కినప్పటి నుంచి ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అధికారులను ఆశ్రయించారు. ఈ ఉదంతంపై తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించింది. రాజశ్రీ ఆచూకీని కనుగొనాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఇస్తాంబుల్‌లోని భారత కాన్సులేట్ జనరల్‌ను కోరారు. స్థానిక పోలీసులు, విమానాశ్రయ అధికారులు, టర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మరోవైపు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర విదేశాంగ శాఖ, దౌత్య కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. అధికారుల నిరంతర కృషి ఫలితంగా జూన్ 18న రాజశ్రీ ఆచూకీ లభించింది. ఆమె ఆచూకీ దొరికిందని, ప్రస్తుతం సురక్షితంగా ఉందని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రయత్నంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఆమె ఏ పరిస్థితుల్లో అదృశ్యమయ్యారనే పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## బీఆర్ఎస్ నేతల భార్యల ఫోన్లూ ట్యాప్!

**మొత్తం 2 వేల మందివి ట్యాప్: చికోటి ప్రవీణ్**

హైదరాబాద్, జూన్ 19 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ కేసు విచారణలో భాగంగా చాలా మందిని పిలిచి.. వారి నుంచి కీలక వివరాలను రాబడుతున్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసిన సిట్ అధికారులు.. వారు ఇచ్చిన వివరాల ఆధారంగా మరికొందరిని విచారణకు పిలుస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్‌ను విచారణకు పిలిచిన సిట్ అధికారులు.. దాదాపు గంటన్నరపాటు విచారణ జరిపి అతడి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సిట్ ఆఫీసులో చికోటి ప్రవీణ్‌ను సిట్ అధికారులు విచారణ చేశారు. విచారణకు వెళ్లే ముందు సిట్ ఆఫీస్ ముందు ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లిన చికోటి ప్రవీణ్ కుమార్.. దర్శనం చేసుకున్నారు. సిట్ విచారణ తర్వాత బయటికి వచ్చి మీడియాతో మాట్లాడిన ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని పేర్కొన్నారు. తమ ఫోన్లను ట్యాప్ చేసి.. పర్సనల్ విషయాలు మొత్తం విన్నారని తెలిపారు. తాను ఊహించిన దానికన్నా దారుణంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తాజా విచారణలో తనకు అర్థమైందని చెప్పారు.

## లక్షలాది కుటుంబాలకు అపన్న హస్తం

సంక్షేమ పథకాల అమల్లో కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. లక్షలాది కుటుంబాలకు అపన్న హస్తం అందిస్తోంది. జిల్లాలో కొత్తగా 45,920 రేషన్ కార్డులు మంజూరు చేసి వేలాది కుటుంబాలకు ఆహార భద్రత కల్పించారు. రేషన్ కార్డులో 96,775 కొత్త సభ్యుల పేర్లను చేర్చారు. 3.20 లక్షల కుటుంబాలకు ప్రతినెల 6,021 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా మహిళల ఆర్థిక సాధికారత కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలు చేసిన 7.39 కోట్ల ఉచిత ప్రయాణాలకు గాను రూ. 334 కోట్ల లబ్ధి చేకూరింది. జిల్లాలో 1.58 లక్షల మంది లబ్ధిదారులకు 9.23 లక్షల గ్యాస్ సిలిండర్లను రూ.500 రూపాయలకే అందిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం 29.78 కోట్ల వెచ్చిస్తున్నది. అదేవిధంగా గృహ జ్యోతి పథకం ద్వారా జిల్లాలో 1.73,627 మంది వినియోగదా రులకు రూ.153 కోట్ల లబ్ధి చేకూరింది. ఇందిరమ్మ పథకం కింద జిల్లాలో 10,114 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 7000 కి పైగా ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 2100 కుటుంబాలు గృహప్రవేశం పూర్తి చేసుకున్నాయి. 100% ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.



# గతి.. ప్రగతి.. ప్రభుత్వ విధి

## కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన విజయవంతం.. 99 రోజుల ప్రజాపాలనతో ప్రజల జీవితాల్లో గణనీయ మార్పు




### మంత్రుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైన కార్యక్రమం

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణకు 2026 మార్చి 6న కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్ , చింతకుంట విజయ రమణారావు ఎంపీలు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు , ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పలువురు అధికారులు హాజరయ్యారు.

### ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో సక్సెస్ ఫుల్.. 99 రోజులు.. 10 ప్రధాన అంశాలు.. సమగ్ర అభివృద్ధి

### గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు.. కార్యాచరణ విజయవంతం.. పారదర్శక పరిపాలన.. వేగవంతమైన సేవలు.. సుస్థిర అభివృద్ధి

99 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో చారిత్రాత్మకంగా నిలిచింది. ప్రజల జీవితాల్లో పెను మార్పులను తీసుకొచ్చింది. గ్రామ గ్రామాన వార్డు మెంబర్ నుంచి మంత్రుల వరకు.. మరోపక్క పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు.. అందర్నీ భాగస్వామ్యం చేసింది ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక. ఇంతకు మునుపెన్నడూ జరగని విధంగా ఈ కార్యక్రమం 99 రోజులపాటు నిరాటకంగా జరగడం విశేషం. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ అయ్యేలా చేసింది. జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా ఈ కార్యక్రమం ముగిసింది.

10 ప్రధాన అంశాలపై షెడ్యూల్ వారీగా నిర్వహించి పాలన ప్రజలకు మరింత చేరువైంది. కరీంనగర్ జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12, 2026 వరకు అమలైన ఈ కార్యక్రమం గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో అద్భుతంగా జరిగింది. తద్వారా కరీంనగర్ జిల్లా ప్రగతి ప్రధాన నిలిచేందుకు దోహదపడింది. కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచింది. కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. మంత్రుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సహకారంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక దిగ్విజయంగా పూర్తయింది. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించారు.

### పరిశుభ్రత.. ఫైళ్ల పరిష్కారంలో ప్రధాన పాత్ర

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మొట్టమొదటి అంశం ఫైళ్ళ పరిష్కారం పరిశుభ్రత కార్యక్రమం. జిల్లాలోని 318 గ్రామపంచాయతీలు కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు హుజురాబాద్ జమ్మికుంట చొప్పదండి మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మార్కెట్లు, హాస్టళ్లు, శ్మశానవాటికలు, బస్టాండ్లలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పరిశుభ్రతకు నోచుకోని ఆయా కేంద్రాలు ప్రస్తుతం శోభాయమానంగా తయారయ్యాయి. ప్రభుత్వం చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పాత సామగ్రిని తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అదేవిధంగా ఫైళ్ల పరిష్కారానికి ప్రధానంగా కృషి చేశారు. జనన-మరణ ధ్రువపత్రాలు, వ్యాపార లైసెన్సులు, మ్యుటేషన్లు, లేఅవుట్ అనుమతులు, ఈ-ఆఫీస్ ఫైళ్లతో కలిపి మొత్తం 4,290 ఫైళ్లను జిల్లాలో పరిష్కరించారు. భూభారతి కింద అందిన 239 దరఖాస్తులను పరిష్కారానికి అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. ఇంటి వద్దే చెత్త వర్గీకరణ, హోం కంపోస్టింగ్, ప్లాస్టిక్ నిషేధం, ఈ-వేస్ట్ సేకరణ, ఫాగింగ్, బ్లీచింగ్, డ్రైనేజీల పూడికతీత కార్యక్రమాలు చేపట్టారు.

### రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ముందడుగు

ఏప్రిల్ 13 నుంచి 18 వరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందడుగు పడింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో నూతన మార్పు తీసుకొచ్చారు. 318 గ్రామపంచాయతీల్లో రోడ్డు భద్రత గ్రామసభలు నిర్వహించి 2,986 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేశారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. 19 ప్రాంతాల్లో గోల్డెన్ అవర్ స్పందన శిక్షణ, రాహవీర్, పీఎం రాహత్ పథకాలపై కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలు, మరణాలు సంఖ్య గణనీయంగా తగ్గింది. జీరో ఎన్ఫోర్స్మెంట్ డే సందర్భంగా హెల్మెట్ ధరించిన వాహనదారులను పూలతో అభినందించారు. అత్యధికంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లుగా గుర్తించి వాటి నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రజలు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, పిల్లల భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనాథ, విడిచిపెట్టబడిన పిల్లలపై సర్వే చేపట్టారు. నాలుగు నియోజకవర్గాల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సమావేశాలు నిర్వహించారు.

### అన్నదాతకు అండగా..

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రైతు వారోత్సవాల్లో భాగంగా అన్నదాతకు అండగా నిలిచారు. రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ను ప్రారంభించారు. 76 రైతు వేదికల్లో నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, వినియోగదారులు ఇష్టపడే వరి రకాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని రైతులను ప్రోత్సహించారు. అదేవిధంగా ఫామ్ ఆయిల్ పంటను అత్యధికంగా పండించాలని అధికారులు గ్రామ గ్రామానా విస్తృత ప్రచారం నిర్వహించారు. హార్టికల్చర్, మార్కెటింగ్, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. “ఖేతీ బచావో అభియాన్” ద్వారా జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించారు.

### వైద్యా ఆరోగ్య రంగానికి పెద్ద పీట

వైద్యం ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీటవేశారు.ఆహార భద్రత, సురక్షిత మాతృత్వం, ఎయిడ్స్ నివారణ, ఆయుష్, హోమియోపతి సేవలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలతో పాటు కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో విస్తృతమైన కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. నాణ్యమైన ఔషధాల లభ్యత, నియంత్రణ వ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపట్టారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సదుపాయం అందేలా జిల్లా యంత్రాంగం తరఫున ప్రత్యేక కృషి చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దడంలో కరీంనగర్ జిల్లా ప్రముఖ పాత్ర పోషిస్తున్నది.





### సంక్షేమ విద్యా సంస్థలకు.. కొత్త రూపు

అన్ని సంక్షేమ విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కొత్త రూపు తీసుకొచ్చారు. అన్ని సంక్షేమ విద్యాసంస్థల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి ఆహార భద్రత కమిటీలను ఏర్పాటు చేశారు. 1,220 మంది విద్యార్థులతో ప్రతిభా ఉత్సవాలు నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, పోషణ, క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకతపై తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. సంక్షేమ విద్యాసంస్థలకు కొత్త రూపు తీసుకొచ్చి మొత్తంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం నాణ్యమైన విద్య బోధన అందిస్తున్నది. అదేవిధంగా ప్రభుత్వం రుచికర భోజనం సన్నబియ్యంతో అందిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గణనీయ మార్పును తీసుకొచ్చారు. బడిబాట కార్యక్రమం ద్వారా 2026--27 విద్యా సంవత్సరానికి 5,102 ప్రవేశాల లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. 11 భవిత కేంద్రాలు, ఐదు వంటశాల భవనాలు, ఒక సైన్స్ ల్యాబ్ను ప్రారంభించారు. 17 పీఎం శ్రీ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించారు. జేఈఈ, నీట్, క్లాట్ కోచింగ్ కార్యక్రమాలు చేపట్టారు. తల్లిదండ్రుల సమావేశాలు, లైబ్రరీ డే, కళలు--సంస్కృతి దినోత్సవం, విద్యా విజయోత్సవం నిర్వహించారు. మొత్తానికి విద్య శాఖ బలోపేతానికి జిల్లా యంత్రాంగం విద్యాశాఖ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టింది.

### రైతు భరోసా పథకం ద్వారా..

1,93, 544 మంది రైతులకు 143.55 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మరణించిన 206 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా ద్వారా ప్రభుత్వం ఇప్పటివరకు 13.35 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. అదేవిధంగా ఈ సీజన్లో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. తద్వారా 554 కోట్లు రైతులకు ప్రభుత్వం అందించింది. అదేవిధంగా 23,710 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేశారు.

### నిరుద్యోగులకు ఉపాధి కల్పన లక్ష్యంగా ముందుకు..

జిల్లాలో పెద్ద ఎత్తున నిరుద్యోగులకు వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం కలెక్టరేట్లో మెగా జాబ్ మేళా నిర్వహించారు. నిరుద్యోగ యువతీ యువకుల నుంచి విశేష స్పందన లభించింది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ జాబ్ మేళా దిక్సూచిగా పనిచేసింది. ఈ మేళాలో 78 వివిధ ప్రైవేట్ కంపెనీలు పాల్గొనగా, దాదాపు 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. కరీంనగర్ జిల్లాలో హుజురాబాద్ చొప్పదండి ఇతర చోట్ల ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా జాబ్ మేళా లు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందిస్తున్నారు.




### రాష్ట్రానికే దిక్సూచి.. కరీంనగర్ జిల్లా

99 రోజుల కార్యక్రమం ప్రజల ఆకాంక్షలను ఫలితాలుగా మలిచిన సమగ్ర అభివృద్ధి యజ్ఞం. ప్రభుత్వ దృఢ సంకల్పం, జిల్లా యంత్రాంగం సమర్థ నిర్వహణ, ప్రజాప్రతినిధుల చొరవ, ప్రజల చురుకైన భాగస్వామ్యం కలిసొచ్చినప్పుడు మార్పు ఎంత వేగంగా సాధ్యమవుతుందో కరీంనగర్ జిల్లా ఆచరణలో చాటిచెప్పింది. రైతుకు అండగా, మహిళకు ఆత్మవిశ్వాసంగా, యువతకు అవకాశాల వేదికగా, విద్యార్థులకు ఆశల పునాదిగా, గ్రామాలకు పరిశుభ్రతగా, సమాజానికి చైతన్య స్ఫూర్తిగా ఈ ప్రణాళిక ప్రతి రంగంలో స్పష్టమైన ప్రభావాన్ని చూపించింది. పాలన కార్యాలయాల గోడలకే పరిమితం కాకుండా ప్రజల గడపకు చేరినప్పుడు, సంక్షేమ పథకాలు కేవలం గణాంకాలుగా కాకుండా కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపినప్పుడు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రచారంగా కాకుండా ప్రజల అనుభవాలుగా మారినప్పుడు కలిగే సానుకూల మార్పులకు ఈ 99 రోజుల ప్రగతి ప్రణాళిక ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. కాలవ్యవధి 99 రోజులే అయినప్పటికీ... ఈ ప్రగతి ప్రస్థానం ప్రభావం మాత్రం దీర్ఘకాలం నిలిచేలా ఉంది. ప్రజల భాగస్వామ్యంతో పాలనను మరింత చేరువ చేసిన కరీంనగర్ జిల్లా, సమగ్ర అభివృద్ధికి కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ తెలంగాణకు ఆదర్శంగా అవతరించింది. అందుకే ఈ 99 రోజుల ప్రగతి కేవలం ఒక కార్యక్రమం విజయకేతనం కాదు; ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న పాలనకు ప్రతీకగా, కరీంనగర్ జిల్లాకు దక్కిన సరికొత్త గుర్తింపుగా చరిత్రలో నిలిచిపోనుంది.





## మహిళ కడుపులో 7 కిలోల కణితి తొలగింపు



జగిత్యాల, జూన్ 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ధర్మపురి పట్టణానికి చెందిన ఓ మహిళ తీవ్ర కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరగా, వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి ఆమె కడుపులో 7 కిలోలకుపైగా బరువున్న కణితి ఉన్నట్లు గుర్తించారు. అనంతరం సర్జన్ డాక్టర్ శ్రీకాంత్, స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిర్వహించి కణతిని విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇంత పెద్ద పరిమాణంలో కణతులు ఉండడం చాలా అరుదని, సకాలంలో చికిత్స అందడంతో సమస్య నుంచి బయటపడగలిగినట్లు పేర్కొన్నారు.

## మాదిగ యువజన సంఘం భవనానికి నిధులివ్వాలి

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు వినతిపత్రం

జగిత్యాల, జూన్ 19 (ఈవార్తలు): జగిత్యాల మండలం చలిగల్ మాదిగ యువజన సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం భవన అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సంఘం భవన అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గంగారెడ్డి, అబ్బూరి మల్లేశం గౌడ్, పులిశెట్టి శ్రీనివాస్, నలువల సురేష్, నరేష్‌తో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## బంగారం అమ్మిస్తామని మహిళకు మోసం

### పోలీసుల చాకచక్యంతో దొరికిన దొంగలు

జగిత్యాల టౌన్, జూన్ 19 (ఈవార్తలు): కుమారుడి వైద్యం కోసం వచ్చిన ఓ మహిళను నమ్మించి బంగారు ఆభరణాలు తీసుకెళ్లిన ఇద్దరు వ్యక్తులను జగిత్యాల టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన గండి లలిత ఈ నెల 16న కుమారుడి చికిత్స కోసం జగిత్యాల పట్టణంలోని మహదేవ ఆస్పత్రికి వచ్చింది. ఆస్పత్రి బిల్లు చెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో బంగారం అమ్మాలని భావించింది. ఈ విషయాన్ని గమనించిన ఇద్దరు వ్యక్తులు బంగారం అమ్మించి డబ్బులు తెస్తామని చెప్పి ఆభరణాలు తీసుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై ఎం. సుప్రియ, కానిస్టేబుళ్లు జీవన్, చంద్రశేఖర్‌లతో కలిసి శుక్రవారం కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు కత్తెరపాక దేవేందర్, నంద్యాల తిరుపతిరావుగా గుర్తించారు. వారి వద్ద నుంచి బంగారు పుస్తెలు, గుండ్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ తెలిపారు.

## కన్న కొడుకే వేధిస్తున్నాడని తండ్రి గోడు

### పోషణ, వైద్య ఖర్చులు ఇప్పించాలని వేడుకోలు



జగిత్యాల, జూన్ 19 (ఈవార్తలు): కుమారుడు, కోడలు వేధింపులకు గురిచేస్తున్నారని బుగ్గారం మండలం యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన కోమల్ల కాంతయ్య (71) అనే వృద్ధుడు సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్‌ను ఆశ్రయించారు. తన కుమారుడు విలాస్, కోడలు వేరుగా ఉంటూ తమను పట్టించుకోవడం లేదని, పక్షవాతంతో బాధపడుతున్న భార్యకు వైద్యం చేయించాల్సింది పోయి చికిత్స కోసం కూడబెట్టిన డబ్బులను కూడా తీసుకెళ్లాడని ఆరోపించారు. తాము రేకుల షెడ్డులో నివసిస్తూ ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ విషయమై ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తమకు పోషణ, వైద్య ఖర్చులు ఇప్పించడంతో పాటు తీసుకున్న డబ్బులను తిరిగి ఇప్పించాలని ఆర్డీవో, పోలీసు అధికారులను కోరారు. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్, పి.సి. హన్మంత్ రెడ్డి, వెల్ముల ప్రకాశ్ రావు, విశ్వనాథం, ఎం.డి. యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



## యెల్ల శ్రీనివాస్‌కు దుబాయ్‌లో ఘన నివాళి

దుబాయ్: గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం సభ్యుడు యెల్ల శ్రీనివాస్ గంగపుత్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాస్ ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వెళ్లగా, అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ విషాద ఘటనపై గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దుబాయ్‌లో సంతాప సభ నిర్వహించారు. శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఐదు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యుడు శ్రీనివాస్ కుటుంబనికి ప్రభుత్వం తరపున ఐదు లక్షల ఎక్స్‌గ్రెసియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు అలాగే శ్రీనివాస్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్టకాలంలో వారికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# తాగునీటిపై దృష్టి పెట్టండి

### జలమండలి అధికారులతో అరికెపూడి గాంధీ సమీక్ష



కూకట్‌పల్లి, జూన్ 19 (ఈవార్తలు): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జలమండలి ఈడీ సంతోష్ రెడ్డి, డైరెక్టర్ నారాయణ, జీఎంలు కృష్ణ, హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి పరిధిలోని వివిధ కాలనీల ప్రజల నుంచి అందిన వినతిపత్రాలపై అధికారులు తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. నీటి కలుషితాన్ని నివారించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతుల ప్రతిపాదనలను సిద్ధం చేసి, అత్యవసర పనులకు ప్రాధాన్యతనిస్తూ వేగంగా పూర్తి చేయాలని గాంధీ ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడా మురుగు నీరు పొంగిపొర్లకుండా చర్యలు తీసుకోవాలని, దెబ్బతిన్న పైపులను మార్చి అవసరమైన చోట కొత్త యూజీడీ, మంచినీటి పైప్‌లైన్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీజీఎంలు మన్నారాయణ, శ్రీనివాసరాజు, నరేందర్, జేడీఎం శ్రీహరి, మేనేజర్లు సందీప్, విక్రమ్ రెడ్డి, సలోమీ, ప్రియాంక, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే సత్యం భరోసా

### స్వయంగా హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శ



గంగాధర, జూన్ 19 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని వివిధ ప్రమాదాల్లో గాయపడి జిల్లా కేంద్రంలోని సన్‌రైజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను చొప్పదండి శాసనసభ్యుడు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం గారు ఈరోజు ప్రత్యక్షంగా సందర్శించి పరామర్శించారు. గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ప్రమాదవశాత్తూ తాడిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే, ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు లంకదాసరి మల్లయ్య రోడ్డు ప్రమాదానికి గురై అదే హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాలు తెలుసుకున్న ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం గారు తక్షణమే హాస్పిటల్‌కు చేరుకుని బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. అనంతరం బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వం మరియు పార్టీ తరపున బాధితుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బైరిశెట్టి సంపత్, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం

### జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ స్పష్టీకరణ

### విద్యార్థులతో కలిసి భోజనం



జగిత్యాల బ్యూరో, జూన్ 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పురాతన పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి, సమయానికి భోజనం అందుతున్నదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. డైట్ మెనూ అమలు, వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ విధానాలు, కిచెన్ షెడ్ నిర్వహణపై కూడా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు దృష్ట్యా పోషకాహారం సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థికి సమయానికి, సమానంగా, సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సర్కారు బడికి సర్పంచ్ పిల్లలు!



జగిత్యాల, జూన్ 19 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కుర్మపల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. రాయికల్ మండలం కుర్మపల్లి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో గ్రామ సర్పంచ్ మ్యాకల మల్లేశం తన ఇద్దరు పిల్లలకు, ఉప సర్పంచ్ పుల్ల లత-మల్లేశ్ తమ ఇద్దరు పిల్లలకు శుక్రవారం అడ్మిషన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని తల్లిదండ్రులను ప్రోత్సహించారు. నూతనంగా 15 మంది విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు గ్రామ సర్పంచ్ మ్యాకల మల్లేశం, ఉప సర్పంచ్ పుల్ల లత-మల్లేశ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దయ్యాల కొమురవ్వ ప్రత్యేకంగా కృషి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎలిగేటి రాజకిశోర్, ఉపాధ్యాయురాలు వొద్నల ప్రియాంక, దయ్యాల మంజుల, పుల్ల మానస, పుల్ల తిరుమల, పుల్ల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



## చింతకుంట చెరువులోకి మోరీ నీళ్లు!

### ఇస్లాంపురా వాసుల ఇబ్బందులు.. తక్షణ చర్య కోరిన కౌన్సిలర్లు

జగిత్యాల టౌన్, జూన్ 19 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఇస్లాంపురా ప్రాంతం వార్డు నంబర్ 30, 31లలో డ్రెయిన్ సమస్యపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జుమా నమాజ్ అనంతరం వార్డు కౌన్సిలర్లు ప్రజలతో కలిసి డ్రెయిన్‌ను పరిశీలించారు. 31వ వార్డు మజ్లిస్ కౌన్సిలర్ మహమ్మద్ రిజా ఉద్దీన్ మాట్లాడుతూ, వివిధ వార్డుల మురుగు నీరు చింతకుంట చెరువులో కలుస్తుండటంతో బోర్‌వెల్ నీరు కలుషితమై దుర్వాసన వస్తోందని తెలిపారు. దీనివల్ల చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగు నీరు చెరువులో కలవకుండా కొత్త డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పనులు ప్రారంభం కావడం లేదని ఆయన విమర్శించారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంటనే ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించి, కౌన్సిలర్‌తో వివరాలు తెలుసుకున్నారు. త్వరలోనే డ్రెయిన్ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం.

## కొండగట్టు అంజన్న సేవలో దర్శకుడు క్రాంతి సకినాల

మల్యాల, జూన్ 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నూతన చిత్ర బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. తమ కొత్త సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సినీ నటుడు రమణారెడ్డి, చిత్ర నిర్మాత రాజేష్ సవరవు, రచయిత-దర్శకుడు క్రాంతి సకినాల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. నూతన చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పూజ కార్యక్రమాన్ని కొండగట్టు క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర బృందం స్వామివారి సన్నిధిలో కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించి సినిమా నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తికావాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రాజేష్ సవరవు మాట్లాడుతూ, కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టే ముందు కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీస్సులు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

జగిత్యాల టౌన్, జూన్ 19 (ఈవార్తలు): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగిత్యాల పట్టణంలోని మోతె రోడ్డులో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు మరింత బలంగా, అభివృద్ధి దిశగా సాగాలంటే రాహుల్ గాంధీ వంటి నాయకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్, నాయకులు కొత్త మోహన్, దుమాల రాజ్‌కుమార్, మీర్ ఖాజీం అలీ, ముకేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.



## పొలాసలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

### పాల్గొన్న మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల రూరల్, జూన్ 19 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని సహస్ర లింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహాన్ని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించబడింది. అనంతరం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం పుట్టిన రోజు సందర్భంగా కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి ముందు ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ చైర్మన్ దినేశ్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, సర్పంచ్ మిల్కురి శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, బండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువల జ్యోతి లక్ష్మణ్, పురుషోత్తం రావు, టీవీ సూర్యం, మాజీ సర్పంచ్ చిర్ర నరేష్, దుమాల రాజ్ కుమార్, ఖాజిం అలీ, ముకేష్ ఖన్నా, సురేష్, బీరబతిని శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ డీసీసీ ఉపాధ్యక్షుడిగా పురుమళ్ల మనోహర్

కరీంనగర్, జూన్ 19 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షునీగా గంగాధర మండలం ఆచంపల్లి గ్రామానికి చెందిన పురుమాళ్ల మనోహర్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మెరకు శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో మనోహర్ కు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పని చేస్తానని తెలిపారు. తన నియామ్మకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారికి, మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు గారికి, మా ప్రియతమ నాయకుడు డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం గారికి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మనోహర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

లయ్యారి చిత్రం







## 'నాగబంధం' ట్రైలర్.. గూస్ బంప్స్

పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతున్న మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్ నాగబంధం మూవీపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. టీజర్, పాటలతో ఆసక్తిని రేకెత్తించిన ఆ చిత్రం తాజాగా విడుదలైన ట్రైలర్ తో హైప్ మరింత పెంచింది. డైరెక్టర్ అభిషేక్ నామా తన విజన్ ను మరోసారి ట్రైలర్ ద్వారా ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చారు. జూలై 3న విడుదల కానున్న ఆ సినిమా ద్వారా ఇండియన్ కల్చర్, డివోషనల్ ఎలిమెంట్స్ ను మోడ్రన్ విజువల్ టెక్నాలజీతో మిక్స్ చేసి గ్రాండ్ ఎక్స్పీరియన్స్ అందించబోతున్నట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. మూడు నిమిషాల 19 సెకన్ల రన్ టైమ్ తో ఉన్న ట్రైలర్ ప్రారంభం నుంచే ఆసక్తిని పెంచేలా రూపొందించారు. కథ మొత్తం బ్రహ్మ కమలం అనే డివోషనల్ ఫ్లవర్ చుట్టూ తిరుగుతున్నట్లు చూపించారు. ఆ ఫ్లవర్ ను సొంతం చేసుకుంటే అనేక శక్తులు, కోరికలు నెరవేరుతాయనే అంశాన్ని హైలైట్ చేశారు. అదే పవర్ ను సొంతం చేసుకోవడానికి దుష్ట శక్తులు, రాక్షసులు చేసే ప్రయత్నాలు కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. అంతేకాదు పురాతన దేవాలయాలు, గుప్తనిధులు, వేల ఏళ్లుగా దాగి ఉన్న రహస్యాలను కథలో భాగం చేసిన విధానం ఆసక్తికరంగా ఉంది. ముఖ్యంగా 108 విష్ణు దేవాలయాల నేపథ్యంలో కథను అల్లినట్లు కనిపిస్తోంది. 'గుప్తనిధుల్లో దాగి ఉన్న ఖజానా భూమిని మాత్రమే శాసిస్తుంది.. కానీ బ్రహ్మ కమలం బ్రహ్మాండాన్నే శాసిస్తుంది' అనే డైలాగ్ ట్రైలర్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ ఒక్క డైలాగ్ తో స్టోరీ రేంజ్ ఎంత పెద్దదో తెలియజేసే ప్రయత్నం చేశారు. హీరో విరాట్ కర్ణ సినిమాలో రెండు భిన్నమైన షేడ్స్ లో కనిపించనున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఒకవైపు సాహస యాత్రికుడిగా, మరోవైపు నాగసాధువుగా ఆయన రోల్ రూపొందింది. ముఖ్యంగా పరమశివుడి ఉగ్రరూపాన్ని తలపించే కొన్ని సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి.




## బాలయ్యతో మరోసారి కాజల్

నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబోలో మరో మూవీ రాబోతున్న విషయం తెల్సిందే. ఎన్‌బీకే111 వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నయనతార నటించబోతున్నట్లు గతంలోనే అధికారిక ప్రకటన వచ్చింది. నయనతార బర్త్‌డే సందర్భంగా ఎన్‌బీకే111 యూనిట్ సభ్యుల తరపున ప్రత్యేకమైన వీడియో సైతం రిలీజ్ అయ్యింది. ఇప్పుడు మరో హీరోయిన్ ఈ సినిమాలో నటిస్తున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. బాలకృష్ణకు జోడీగా గతంలో భగవంత్ కేసరి సినిమాలో కాజల్ అగర్వాల్ నటించిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఆ కాంబో మళ్లీ రిపీట్ కాబోతుంది. భగవంత్ కేసరి సినిమా తర్వాత బాలయ్యతో మరోసారి జత కట్టేందుకు గాను కాజల్ అగర్వాల్ రెడీ అయ్యింది. నేడు కాజల్ బర్త్‌డే సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఒక పోస్టర్‌ను విడుదల చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## నాగదుర్గతో ప్రియదర్శి రొమాన్స్



టాలీవుడ్ లో ప్రస్తుతం కమర్షియల్ హంగుల కంటే కూడా మట్టి వాసన ఉన్న కథలకే ఆడియన్స్ ఎక్కువగా ఎట్రాక్ట్ అవుతున్నారు. ఈ సరికొత్త ట్రెండ్ ను సరిగ్గా క్యాచ్ చేసిన స్టార్ డైరెక్టర్ సుకుమార్ తన సొంత బ్యానర్ సుకుమార్ రైటింగ్స్, సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ వర్క్స్ తో కలిసి ఒక వైవిధ్యమైన ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేశారు. కొత్త దర్శకుడు వంశీ రెడ్డి ఈ సినిమాతో మెగాఫోన్ పడుతున్నాడు. ఇదొక స్వచ్ఛమైన కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా అని అనౌన్స్మెంట్ తోనే అందరికీ ఒక క్లారిటీ వచ్చేసింది. ఈ ప్రాజెక్ట్ కు సంబంధించిన లేటెస్ట్ వివరాల్లోకి వెళితే.. మేకర్స్ తీసుకున్న ఒకే ఒక్క నిర్ణయం ఇండస్ట్రీలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణకు చెందిన పాపులర్ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గను ఈ సినిమాలో హీరోయిన్ గా ఎంపిక చేశారట. నల్లగొండ ప్రాంతానికి చెందిన ఆమెకు జానపద కళల్లో ఎంతో మంచి పట్టుంది. కేవలం గ్లామరస్ హీరోయిన్స్ ని కాకుండా ఇలాంటి నేచురల్ టాలెంట్‌ను వెండితెరకు పరిచయం చేయడం వెనుక దర్శకుడి పక్కా ప్లాన్ కనిపిస్తోంది. ఇక దర్శకుడు సుకుమార్ సినిమాల్లో క్యారెక్టర్లు చాలా రూటెడ్ గా, రియలిస్టిక్ గా ఉంటాయి. ఇక ఈ సినిమాలో కూడా కథలోని నేటివిటీని పర్ఫెక్ట్ గా మ్యాచ్ చేయడం కోసమే నాగదుర్గను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇదొక ఎమోషనల్ గా సాగే రూరల్ డ్రామా కావడంతో ఆ వాతావరణానికి, ఆ యాసకు పక్కాగా సరిపోయే అమ్మాయి కావాలనే ఈ సర్ ప్రైజ్ ఛాయిస్ తీసుకున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్న మాట. ఇక ఈ ప్రాజెక్ట్ లో మరో అతిపెద్ద ప్లస్ పాయింట్ యంగ్ హీరో ప్రియదర్శి. కామెడీ పాత్రలకే పరిమితం కాకుండా కంటెంట్ ఉన్న సబ్జెక్ట్స్ ను ఎంచుకుంటూ తనేంటో ప్రూవ్ చేసుకుంటున్నాడు. ఇప్పుడు మరోసారి ఒక పల్లెటూరి నేపథ్యంలో సాగే ఇంటెన్స్ ఎమోషనల్ కథతో రాబోతుండటంతో ఈ సినిమాపై ముందు నుంచే అంచనాలు పెరిగిపోతున్నాయి. సుకుమార్ రైటింగ్స్ బ్రాండ్ వాల్యూ ఈ సినిమాకు అతిపెద్ద అండగా నిలవబోతోంది. కుమారి 21ఎఫ్, ఉప్పెన లాంటి సినిమాలతో కొత్త టాలెంట్ ను ఎంకరేజ్ చేసి బ్లాక్ బస్టర్స్ కొట్టిన అద్భుతమైన ట్రాక్ రికార్డు ఈ బ్యానర్ కు ఉంది. బన్నీ వాస్ లాంటి జడ్జిమెంట్ ఉన్న ప్రొడ్యూసర్ తోడవ్వడంతో ఈ చిన్న బడ్జెట్ కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమా థియేట్రికల్ గా, ఓటీటీ పరంగా కూడా డిస్ట్రిబ్యూటర్లకు భారీ లాభాలను తెచ్చిపెట్టే అవకాశం పుష్కలంగా ఉంది.

## అల్లు అర్జున్‌కు కోర్టు నోటీసులు



సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో హీరో అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేయడం మరోసారి ఆ వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. కేసు విచారణలో భాగంగా సోమవారం నాడు కోర్టుకు హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. అల్లు అర్జున్ తో పాటు ఆ కేసులో నిందితులుగా ఉన్న మరికొందరికీ సమన్లు జారీ అయ్యాయి. నిందితుల వ్యక్తిగత హాజరు అనంతరం కేసు విచారణ నెక్స్ట్ స్టేజ్ లోకి వెళ్లనుంది. 2024 డిసెంబర్ 4న పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ లోని సంధ్య థియేటర్ వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు, ప్రేక్షకులు చేరుకున్నారు. ఈ క్రమంలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అప్పట్లో ఆ ఘటన తీవ్ర సంచలనం రేపింది. సినిమా ప్రీమియర్ షోల సెక్యూరిటీ, ఆడియెన్స్ కంట్రోలింగ్, నిర్వాహకుల బాధ్యతలపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఆ ఘటనపై కేసు నమోదు చేసిన చిక్కడపల్లి పోలీసులు చాలా కాలంపాటు దర్యాప్తు చేపట్టారు. మొత్తం 23 మందిని నిందితులుగా చేర్చి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఆ కేసులో అల్లు అర్జున్ ను ఏ11 నిందితుడిగా చేర్చగా, ఏ 1 నుంచి ఏ 10 వరకు సంధ్య థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులను నిందితులుగా పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్లలో లోపాలు, ప్రజలను నియంత్రించలేకపోవడం వంటి అంశాలను పోలీసులు దర్యాప్తులో పరిశీలించారు. ఛార్జ్ షీట్ ను పరిశీలించిన నాంపల్లి కోర్టు కేసు విచారణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే క్రమంలో నిందితులకు సమన్లు జారీ చేసింది.



## సొసైటీ వల్లే పెళ్లికి దూరంగా జెన్ జీ: రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఒక ఇంటర్వ్యూలో పెళ్లి గురించి, అలాగే నేటి యువత ఆలోచనా తీరు గురించి కొన్ని చాలా ఇంట్రెస్టింగ్ అండ్ బోల్డ్ కామెంట్స్ చేశారు. పెళ్లి ఒక అవుట్ డేటెడ్ కాన్సెప్ట్?: ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో రష్మికకు నేటి తరం జెన్-జీ పెళ్లిని ఒక 'అవుట్ డేటెడ్' కాన్సెప్ట్‌గా భావిస్తోందనే ప్రశ్న ఎదురైంది. దీనికి ఆమె చాలా ప్రాక్టికల్‌గా స్పందించారు. సమాజం పెళ్లి విషయంలో కొన్ని కఠినమైన రూల్స్ పెట్టిందని, ముఖ్యంగా అమ్మాయిలకు ఒక నిర్దిష్ట వయసు రాగానే కచ్చితంగా పెళ్లి చేసేయాలనే ఒత్తిడి తెస్తుందని రష్మిక అన్నారు. ఇక సొసైటీ పెట్టిన ఇలాంటి రూల్స్ నచ్చకే నేటి యూత్ పెళ్లికి దూరంగా ఉండాలని ఆలోచిస్తోందని ఆమె చెప్పుకొచ్చారు. పెళ్లి అనేది కేవలం సమాజం పెట్టిన రూల్స్ కోసమో, ఎవరో ఏదో అనుకుంటారనో చేసుకోవాల్సిన అవసరం లేదని రష్మిక తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

## హాట్‌స్టార్‌లో 'మా ఇంటి బంగారం'



నందిని రెడ్డి దర్శకత్వంలో స్టార్ హీరోయిన్ సమంత తాజాగా నటించిన చిత్రం మా ఇంటి బంగారం. శ్రీముఖి , అర్చన , గుల్షన్ దేవయ్య తదితరులు కీలకపాత్రలు పోషిస్తూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ప్రస్తుతం ఆడియన్స్ నుంచి మంచి స్పందన అందుకుంటోంది. ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా సమంత భర్త, ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరు తో పాటు హిమాంక్ ఈ చిత్రాన్ని నిర్మించారు. పైగా రాజ్ ఈ చిత్రానికి కథా , స్క్రీన్ ప్లే కూడా అందించడం గమనార్హం. ఓ బేబీ తర్వాత మళ్లీ సమంత , నందిని రెడ్డి కాంబినేషన్లో వచ్చిన ఈ సినిమా ఈ ఓటీటీ లోకి రాబోతోంది అనే విషయానికొస్తే ప్రముఖ ఓటీటీ సంస్థ జియో హాట్ స్టార్ వేదికగా ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు మా ఇంటి బంగారం సినిమా టైటిల్ కార్డ్స్ ద్వారా మేకర్స్ స్పష్టం చేశారు. సాధారణంగా ఒక సినిమా థియేటర్లలో విడుదలయ్యి మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది అంటే కచ్చితంగా 4 లేదా ఎనిమిది వారాల తరువాతే ఆ సినిమా థియేటర్లలోకి వస్తుంది. మరి ప్రస్తుతం ఈ సినిమా ప్రేక్షకుల చేత పాజిటివ్ టాక్ అందుకుంటున్న నేపథ్యంలో మరో రెండు నెలల తర్వాతే ఈ సినిమా ఓటీటీలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి అభిమానుల కోరిక మేరకు ముందుగానే ఈ సినిమా ఓటీటీలోకి వస్తుందేమో చూడాలి.



# ఢిల్లీ బ్యాటింగ్ కోచ్‌గా యువీ!

భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కొత్త బాధ్యతలు చేపట్టనున్నాడు. వీడ్కోలు అనంతరం యువ బ్యాటర్లకు కోచింగ్ ఇస్తున్న యువీ.. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్ కోచ్ పదవి చేపట్టనున్నాడు.

**ఐపీఎల్‌లో ఒక్కసారి కూడా టైటిల్ నెగ్గని ఢిల్లీని విజేతగా నిలిపేందుకు కృషి చేయనున్నాడు. ఐపీఎల్ 20వ సీజన్‌లో యూవీని తమ బ్యాటింగ్ కోచ్‌గా నియమించుకునేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ సిద్ధమవుతోందని సమాచారం.**




ఐపీఎల్‌లో ఒక్కసారి కూడా టైటిల్ నెగ్గని ఢిల్లీ క్యాపిటల్స్ టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ను కోచ్‌గా నియమించనుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో విజయవంతమైన యూవీకి యువకులకు బ్యాటింగ్ మెకలువలు నేర్పే బాధ్యతను అప్పగించనుంది ఢిల్లీ. ఐపీఎల్ సీజన్ 2027కు ముందే ఢిల్లీ క్యాపిటల్స్ తమ కోచింగ్ సిబ్బందిని మార్చనుంది. 2027-28 సీజన్ కోసం ప్రస్తుతం కోచింగ్ యూనిట్‌లో భాగమైన వేణుగోపాల్ రావు, హేమంగ్ బదొని, మునాఫ్ పటేల్ స్థానాల్లో కొత్త వాళ్లను తీసుకోవాలని ఢిల్లీ భావిస్తోంది అని ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ అభిషేక్ శర్మలను సానబెట్టిన యువరాజ్ ఇకపై ఢిల్లీ బ్యాటింగ్ యూనిట్‌ను చక్కదిద్దనున్నాడు. టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సైతం ఢిల్లీ ఫ్రాంచైజీతో కొనసాగనున్నాడు. ఢిల్లీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా సేవలందించనున్నాడు. టీమిండియా ఆల్‌రౌండర్‌గా హిట్ కొట్టిన యువరాజ్ సింగ్ ఐపీఎల్‌లో 132 మ్యాచ్‌లు ఆడాడు. 2109లో ముంబై ఇండియన్స్ తరఫున చివరి మ్యాచ్ ఆడిన యూవీ.. రిటైర్మెంట్ అనంతరం అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ వంటి ఆటగాళ్లకు కోచింగ్ ఇస్తున్నాడు.

# మళ్లీ ఢిల్లీకి పంత్




ఐపీఎల్-2025 సీజన్‌లో ఢిల్లీ జట్టు కెప్టెన్సీ బాధ్యతలను అక్షర్ చేపట్టాడు. అతడి సారథ్యంలోని ఢిల్లీ గత రెండు సీజన్లలోనూ కనీసం ప్లే ఆఫ్స్‌నకు చేరలేకపోయింది. దీంతో ఢిల్లీ యాజమాన్యం అక్షర్ కెప్టెన్సీపై ఆసంతృప్తిగా ఉందంట. దీంతో అక్షర్ స్థానంలో రాహుల్‌ను సారథిగా నియమించేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ సిద్ధమైనట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా తమ కథనంలో పేర్కొంది. ఒకవేళ కేఎల్ రాహుల్ బాధ్యతలు చేపడితే.. ఐపీఎల్-2026లో కూడా అదరగొట్టాడు. కేవలం 14 ఇన్నింగ్స్‌ల్లోనే 45.61 సగటుతో, 174.41 భారీ స్ట్రైక్ రేట్‌తో 593 పరుగులు చేశాడు. ఇందులో 5 అర్ధసెంచరీలు, ఒక అద్భుత శతకం ఉన్నాయి. ఇక ఢిల్లీ క్యాపిటల్స్‌కు సంబంధించి మరో ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. లక్నో సూపర్ జెయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్‌ను ట్రేడ్ స్వాప్ చేసుకోవాలని ఢిల్లీ భావిస్తుందంట. అందుకు బదులుగా స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను లక్నోకు ఇచ్చేందుకు ఢిల్లీ సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్-2026లో దారుణ ప్రదర్శనకు నైతిక బాధ్యత వహిస్తూ పంత్ ఇటీవల లక్నో కెప్టెన్సీ నుంచి తప్పుకొన్నాడు. అంతకుముందు రిషబ్ తన ఐపీఎల్ కెరీర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్‌తోనే ప్రారంభించాడు. ఆ తర్వాత కెప్టెన్‌గా పనిచేశాడు. మళ్లీ ఇప్పుడు తన సొంత గూటికి వెళ్తే తన పూర్వ వైభవాన్ని పొందే అవకాశముంది.



# రేపు శ్రీలంకతో భారత్-ఏ ఫైనల్

## ఆఫ్గన్‌తో పోరుతో శ్రీలంక గెలుపు.. ఫైనల్‌కు చేరిన శ్రీలంక -ఏ జట్టు



ముక్కోణపు సిరీస్‌లో భారత్ - ఏ జట్టుకు 'ఫైనల్' మ్యాచ్ ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. అఫ్గానిస్థాన్‌తో జరిగిన కీలక పోరులో శ్రీలంక-ఏ 103 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆదివారం జరగనున్న ఫైనల్‌లో భారత్- ఏ - శ్రీలంక - ఏ జట్లు తలపడతాయి. భారీ విజయం సాధిస్తేనే ఫైనల్‌కు చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో.. అఫ్గాన్ అందుకు తగినట్లు దూకుడు ప్రదర్శించలేక ఓటమితో ఇంటిముఖం పట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో అఫ్గాన్ 42.5 ఓవర్లలో 219 పరుగులకు ఆలౌటైంది. ఫైనల్‌కు చేరాలంటే శ్రీలంక ఇచ్చిన టార్గెట్‌ను 29.3 ఓవర్లలోనే అఫ్గాన్ ఛేదించాల్సి ఉంది. కానీ, ఆ దిశగా అఫ్గాన్ ఇన్నింగ్స్ సాగలేదు. దీంతో ముందే లంకకు ఫైనల్ బెర్తు ఖాయమైపోయింది. అఫ్గాన్ ఓపెనర్ హస్సన్ ఐసాఖిల్ (74), ఫార్మనుల్లా సాఫి (43), బహీర్ షా (35) మాత్రమే రాణించారు. లంక బౌలర్లలో దులాజ్ (5/25) ఫైఫర్‌తోపాటు మధులన్ 3.. రవిందు ఫెర్నాండో, విజయ్‌కాంత్ ఒక్కో వికెట్ తీశారు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే శ్రీలంక దూకుడుగా ఆడింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు ఓపెనర్లు నిరోషన్ డిక్వెల్లా (66), అవిష్క ఫెర్నాండో (110) శుభారంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు శతకం (133) భాగస్వామ్యాన్ని నిర్మించారు. నిరోషన్ ఔటైనా.. నువానిదు ఫెర్నాండో (45)తో కలిసి అవిష్క ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ క్రమంలో అతడు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖర్లో రవిందు ఫెర్నాండో (25) దూకుడుగా ఆడటంతో శ్రీలంక 322 పరుగుల భారీ స్కోరును చేయగలిగింది. అఫ్గాన్ బౌలర్లలో ఫరీదూన్ 4, సాఫి 3, మహ్మద్ ఇబ్రహీం ఒక వికెట్ తీశారు.

# హర్షిత్ రాణా రీ ఎంట్రీ

గాయం నుంచి కోలుకున్న యువ ఫాస్ట్ బౌలర్, ఆల్ రౌండర్ హర్షిత్ రాణా అఫ్ఘనిస్తాన్‌తో చెన్నై వేదికగా జరగనున్న మూడో వన్డే కోసం భారత జట్టులో చేరాడు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన టీ20 ప్రపంచ కప్ వార్మప్ మ్యాచ్‌లో రాణా మోకాలికి గాయం కావడంతో అతను మొత్తం టోర్నమెంట్‌తో పాటు 2026 ఐపీఎల్ సీజన్‌కు కూడా దూరమయ్యాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స తీసుకున్న అనంతరం కోలుకొని తిరిగి జట్టుతో కలిశాడు. ఈ సిరీస్‌లో ఇప్పటికే భారత్ 2-0



ఆధిక్యంలో ఉన్నందున రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలను దృష్టిలో ఉంచుకుని హర్షిత్ రాణాకు ఫిట్‌నెస్ నిరూపించుకునే అవకాశం కల్పిస్తున్నారు.

**మూడో వన్డే కోసం టీమిండియా జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే, యశస్వి జైస్వాల్, హర్షిత్ రాణా



# నాకౌట్‌లోకి మెక్సికో ఎంట్రీ

ఫిఫా వరల్డ్‌కప్‌లో కోహోస్ట్ మెక్సికో జట్టు నాకౌట్ దశలోకి ప్రవేశించింది. గ్రూప్ ఏ నుంచి రౌండ్ 32లోకి ఎంట్రీ ఇచ్చింది. దక్షిణ కొరియా దేశంపై 1-0 గోల్స్ తేడాతో మెక్సికో విజయం సాధించింది. దీంతో ఆ జట్టు ఖాతాలోకి ఆరు పాయింట్లు చేరాయి. గడలజరాలో జరిగిన మ్యాచ్‌లో మెక్సికో ప్లేయర్ లూయిస్ రోమో 50వ నిమిషంలో తన జట్టు తరపున గోల్ చేశాడు. గోల్ కీపర్ కిమ్ సెంగ్ యూ గోల్ అందుకున్న తర్వాత అతనికి ఓ ఫీల్డర్ ఢీకొన్నాడు. దీంతో అతని చేతుల్లోంచి బంతి జారింది. ఆ సమయంలో అక్కడ ఉన్న రోమో అద్భుతమైన రీతిలో గోల్స్ చేశాడు. ఆట 87వ నిమిషంలో దక్షిణ కొరియా ప్లేయర్ చో గు సంగ్‌కు గోల్ కొట్టే ఛాన్సు వచ్చింది. కానీ రౌల్ రంగేల్ దాన్ని అడ్డుకున్నాడు. స్వదేశీ మైదానంలో ప్రేక్షకుల నుంచి మెక్సికో జట్టుకు పూర్తి మద్దతు లభించింది. 75వ నిమిషంలో మెక్సికో రెండో గోల్ చేసే అవకాశాన్ని తృటిలో మిస్సైంది. ఈ మ్యాచ్‌లో దక్షిణ కొరియా ఓడినా.. గ్రూపులో పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. తొలి మ్యాచ్‌లో చెక్ రిపబ్లిక్‌పై దక్షిణ కొరియా విజయం సాధించిన విసయం తెలిసిందే. తన తర్వాత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో దక్షిణ కొరియా, చెక్ రిపబ్లిక్‌తో మెక్సికో పోటీపడనున్నాయి.

# డేవిడ్ హ్యాట్రిక్ గోల్స్

**ఖతార్‌పై కెనడా 6-0 విజయం**



ఫిఫా వరల్డ్‌కప్‌లో కెనడా తొలి విక్టరీ నమోదు చేసింది. టోర్నమెంట్‌కు కోహోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఆ దేశం ఇవాళ ఖతార్‌తో జరిగిన మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 6-0 గోల్స్ తేడాతో ఖతార్‌పై విజయం సాధించింది. కెనడా ప్లేయర్ జోనాథన్ డేవిడ్ హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. ఈ విక్టరీతో కెనడా ఖాతాలో నాలుగు పాయింట్లు వచ్చేశాయి. గ్రూపు బీ నుంచి కెనడా నాకౌట్ దశకు చేరుకునే ఛాన్సు ఉంది. బోస్నియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో గోల్ చేసిన కెనడా ప్లేయర్ సైల్ లారిన్.. వాన్‌కోవర్ మ్యాచ్‌లో కూడా ఆ దేశానికి ఫస్ట్ గోల్ అందించాడు. అతను 16వ నిమిషంలో గోల్ చేశాడు. ఆ తర్వాత డేవిడ్ చెలరేగిపోయాడు. 29, 45, 90 నిమిషాల్లో డేవిడ్ హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. కెనడా జట్టులో సలిబా, మనాయి ఓజీ కూడా గోల్స్ చేశారు. స్వంత గడ్డపై హ్యాట్రిక్ గోల్స్ కొట్టిన ప్లేయర్‌గా జోనాథన్ డేవిడ్ నిలిచారు. గతంలో 1966లో ఇంగ్లండ్ ప్లేయర్ జెఫ్ హస్ట్ స్వదేశీ మైదానంలో హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. కెనడా జట్టు భారీ విజయం సాధించినా.. ఆ జట్టుకు ఆనందం లేకుండాపోయింది. మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ కోన్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతను ఆట మధ్యలోనే స్ట్రెచర్‌పై మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఖతార్ మిడ్ ఫీల్డర్ ఆసిమ్ మడిబో తన కాలితో గట్టిగా తాకడంతో కోన్ ఎడమకాలి ఎముక విరిగిపోయింది. తీవ్రమైన నొప్పితో మైదానంలో కోన్ పడిపోయాడు. కాలి ఎముక విరిగడం వల్ల అతని సర్జరీ చేస్తున్నారు. ఈ ఘటనలో ఖతార్ ప్లేయర్ మడిబోకు రెడ్ కార్డ్ ఇచ్చారు. సుమారు నాలుగు నెలల పాటు కెనడా ప్లేయర్ రెస్ట్ తీసుకోవాల్సి ఉంటుంది.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ప్రత్యామ్నాయమే పంటకు రక్ష

తెలంగాణ వ్యవసాయం మరోసారి ప్రకృతి పరీక్షను ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణ నిపుణులు ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరిస్తున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పరిస్థితికి తగిన ముందస్తు ప్రణాళికతో కనిపించడం లేదు. వర్షాధార వ్యవసాయంపై అధికంగా ఆధారపడే తెలంగాణలో రుతుపవనాలు ఆలస్యమైనా, వర్షపాతం తగ్గినా దాని మొదటి దెబ్బ రైతులకే తగులుతుంది. ఇలాంటి సమయంలో ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నీటి నిర్వహణ, విత్తనాల ప్రణాళిక, మార్కెట్ హామీలు వంటి అంశాలపై ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం గత కొన్నేళ్లుగా భారీగా పెరిగింది. అయితే వరి అధిక నీటిని కోరుకునే పంట. ఎల్ నినో కారణంగా వర్షాలు తగ్గితే చెరువులు, ప్రాజెక్టులు, భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో నిండకపోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో రైతులు అప్పులు చేసి వేసిన వరి పంట మధ్యలోనే ఎండిపోయే ప్రమాదం ఉంది. ఒకవైపు పెట్టుబడి నష్టం, మరోవైపు దిగుబడి లేకపోవడం రైతు కుటుంబాలను తీవ్ర సంక్షోభంలోకి నెడుతుంది. ఇక్కడే ప్రభుత్వ పాత్ర కీలకం. కానీ ఇప్పటివరకు రైతులకు స్పష్టమైన పంటల మార్గదర్శకాలు ఇవ్వడం, జిల్లా వారీగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు ప్రకటించడం, అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచడం వంటి చర్యలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ప్రతి ఏడాది ప్రకృతి విపత్తు వచ్చిన తర్వాత సహాయ ప్యాకేజీల గురించి మాట్లాడటం పరిపాటిగా మారింది. కానీ విపత్తును ముందే అంచనా వేసి నష్టాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకోవడం నిజమైన పాలనకు నిదర్శనం. ఈ పరిస్థితుల్లో రైతులు కూడా సంప్రదాయ ఆలోచనల నుంచి బయటకు రావాల్సిన అవసరం ఉంది. జొన్న, సజ్జ, రాగి వంటి చిరుధాన్యాలు, కంది, పెసర, మినుము వంటి పప్పు ధాన్యాలు, నువ్వులు, ఆముదం వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలు ఎల్ నినో పరిస్థితుల్లో మెరుగైన ప్రత్యామ్నాయాలుగా నిలవగలవు. అయితే రైతులు స్వచ్ఛందంగా పంటలు మార్చుకోవడం అంత సులభం కాదు. మార్కెట్ హామీ, కనీస మద్దతు ధర, కొనుగోలు వ్యవస్థ, బీమా రక్షణ వంటి అంశాల్లో ప్రభుత్వం నమ్మకం కల్పించాలి. వ్యవసాయ శాఖ గ్రామస్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వాతావరణ అంచనాల ఆధారంగా రైతులకు సలహాలు ఇవ్వాలి. నీటి లభ్యతను బట్టి మండలాల వారీగా పంటల ప్రణాళిక రూపొందించాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలు, రైతు సంఘాలతో సమన్వయం పెంచి, శాస్త్రీయ సిఫార్సులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి. కేవలం ప్రకటనలు, సమీక్ష సమావేశాలతో సరిపెట్టకుండా అమలు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన సమయం ఇది. ఎల్ నినో ప్రభావం కేవలం వ్యవసాయ సమస్య మాత్రమే కాదు; అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై, ఉపాధిపై, ఆహార భద్రతపై, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపగలదు. రైతు చేతిలో డబ్బు లేకపోతే గ్రామీణ మార్కెట్లు మందగిస్తాయి. వ్యవసాయ అనుబంధ రంగాలు కూడా దెబ్బతింటాయి. కాబట్టి దీనిని సాధారణ వాతావరణ హెచ్చరికగా కాకుండా ఆర్థిక, సామాజిక సవాలుగా ప్రభుత్వం చూడాలి. ప్రకృతి మార్పులను ఎవరూ ఆపలేరు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించే బాధ్యత మాత్రం ప్రభుత్వాలదే. ఎల్ నినో ప్రమాదం ముందే తెలిసినప్పటికీ తగిన ప్రణాళిక లేక రైతులు నష్టపోతే అది ప్రకృతి వైపరీత్యం కంటే పాలనా వైఫల్యంగా చరిత్రలో నిలుస్తుంది. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం వరి ఆధారిత విధానాన్ని పునఃపరిశీలించి, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం, మార్కెట్ భరోసా, నీటి నిర్వహణ, శాస్త్రీయ సలహాలను సమగ్రంగా అమలు చేయాలి. రైతు భవిష్యత్తును అదృష్టంపై వదిలేయకుండా, ముందుచూపుతో నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఇదే.



### యోగా గురించి ప్రజలు తెలుసుకోవాల్సినవి

- యోగా వల్ల శరీరంలోని సమతుల్యతను నియంత్రించే నాడీ వ్యవస్థ మెరుగుపడుతుంది.
- నిరంతర యోగా సాధనతో శరీర భంగిమ మెరుగవుతుంది. కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేసేవారికి ఇది ప్రత్యేకంగా ఉపయోగాపడుతుంది.
- పిల్లల్లో కేవలం శారీరక దృఢత్వమే కాదు, భావోద్వేగ నియంత్రణ, ఓర్పు కూడా పెరుగుతాయని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి.
- వృద్ధుల్లో పడిపోవడం వల్ల జరిగే ప్రమాదాలను తగ్గించడంలో సమతుల్యాసనాలు సహాయపడతాయి.
- క్రీడాకారులు గాయాల నుంచి కోలుకునే ప్రక్రియలో కూడా యోగాను సహాయక సాధనంగా ఉపయోగ్గిస్తున్నారు.
- సంగీత విద్వాంసులు, నర్తకులు, నటులు, అంతరిక్ష యాత్రికులు కూడా శ్వాస నియంత్రణ కోసం యోగా పద్ధతులను అభ్యసిస్తున్నారు.
- నిద్రకు ముందు కొద్ది నిమిషాల సున్నితమైన యోగా సాధన మెరుగైన నిద్రకు దోహదపడుతుంది.
- జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో కొన్ని యోగా భంగిమలు ఉపయోగాపడతాయి.
- సుదీర్ఘ ప్రయాణాలు చేసే వారికి కాళ్లలో రక్తప్రసరణ సక్రమంగా ఉండేందుకు సరళమైన యోగా వ్యాయామాలు మేలు చేస్తాయి.
- మొబైల్ ఫోన్ వినియోగాం వల్ల పెరుగుతున్న 'టెక్ నెక్' సమస్యను తగ్గించేందుకు మెడ, భుజాలకు సంబంధించిన యోగా సాధనలు ఉపయోగాకరంగా ఉంటాయి.

# ఆధునిక జీవితానికి ప్రాచీన భారత సంపద!

**యోగా అనేది కేవలం వ్యాయామం కాదు. అది శరీరం, మనస్సు, ప్రాణశక్తి మధ్య సమతుల్యతను నెలకొల్పే, సంపూర్ణ జీవన విధానం. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు యోగా చేస్తే ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన జీవితాన్ని గడపవచ్చు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు యోగా సాధన చేస్తే ఆరోగ్యకరమైన, ఆనందకరమైన జీవితం సాధ్యమవుతుంది.**

వేల సంవత్సరాల చరిత్ర కలిగిన యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన ఆరోగ్య సంపద. యోగా అనే పదం సంస్కృతంలోని 'యుజ్' అనే ధాతువు నుంచి వచ్చింది. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమన్వయాన్ని సాధించడమే దీని అసలు లక్ష్యం. క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే శరీర వశ్యత పెరుగుతుంది. కండరాలు, కీళ్లు బలపడటంతో పాటు నడుము నొప్పి, మెడ నొప్పి, కీళ్ల సమస్యలు తగ్గుతాయి. ప్రాణాయామం, శ్వాస వ్యాయామాలు ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరచి శరీరానికి తగిన ఆక్సిజన్ అందిస్తాయి. దీంతో శక్తి స్థాయిలు పెరుగుతాయి. శ్వాసకోశ సమస్యల నియంత్రణలో కూడా యోగా ఎంతో దోహదపడుతుంది. మానసిక ఆరోగ్యం విషయంలోనూ యోగా ప్రాధాన్యం అపారం. నేటి కాలంలో ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ధ్యానం, ప్రాణాయామం వంటి యోగా పద్ధతులు మనసును ప్రశాంతంగా ఉంచుతాయి. విద్యార్థులు, ఉద్యోగ్గులు యోగా ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు. యోగా రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తపోటు నియంత్రణకు సహాయపడుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి కూడా ఇది మంచి పరిష్కారం. అయితే యోగాభ్యాసం ఖాళీ కడుపుతో లేదా భోజనం చేసిన మూడు నుంచి నాలుగు గంటల తర్వాత చేయాలి. ప్రారంభ దశలో నిపుణుల పర్యవేక్షణలో నేర్చుకోవడం ఉత్తమం. గర్భిణీలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు వైద్యుల సలహాతో మాత్రమే సాధన చేయాలి. ప్రపంచంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా, మనిషి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఆరోగ్య పరిరక్షణ. అధిక పని ఒత్తిడి, కూర్చొని చేసే ఉద్యోగాలు, ఫాస్ట్ ఫుడ్ అలవాట్లు, నిద్రలేమి, డిజిటల్ పరికరాల అధిక వినియోగాం వంటి కారణాలతో జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో యోగా ఒక ప్రత్యామ్నాయ చికిత్స కాదు; నివారణకు దారితీసే సమగ్ర జీవన విధానం. ఇప్పుడు ప్రపంచంలోని అనేక దేశాల్లో ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేట్ సంస్థలు, సైనిక శిక్షణ కేంద్రాలు కూడా యోగాను తమ ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా చేర్చుతున్నాయి. ఒకప్పుడు భారతీయ సంప్రదాయంగా భావించిన యోగా, ఇప్పుడు అంతర్జాతీయ ఆరోగ్య ఉద్యమంగా మారింది.

పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ యోగా

నేటి విద్యా వ్యవస్థలో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోంది. పరీక్షల భయం, పోటీ వాతావరణం, స్క్రీన్ టైమ్ కారణంగా పిల్లలు చిన్న వయస్సులోనే ఆందోళనకు గురవుతున్నారు. ప్రతిరోజూ కొన్ని నిమిషాల యోగా, ధ్యానం వారికి మానసిక ప్రశాంతతను అందించగలదు. ఉద్యోగాలకు యోగా మరింత అవసరం. గంటల తరబడి కుర్చీలో కూర్చోవడం వల్ల వచ్చే నడుము నొప్పి, మెడ నొప్పి, ఊబకాయం వంటి సమస్యలను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. వృద్ధులకు కీళ్ల కదలిక, సమతుల్యత, శ్వాస సామర్థ్యం మెరుగుపడేందుకు యోగా తోడ్పడుతుంది.

మహిళల ఆరోగ్యంలో యోగా పాత్ర

మహిళల్లో హార్మోన్ల మార్పులు, గర్భధారణ అనంతర ఆరోగ్యం, మెనోపాజ్ దశలో వచ్చే అసౌకర్యాల నిర్వహణలో వైద్యుల సలహాతో చేసే యోగా ఉపయుక్తంగా ఉంటుంది. అయితే ప్రతి ఆసనం అందరికీ సరిపోదు. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి సాధన చేయడం అవసరం. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, సామాజిక మాధ్యమాల వినియోగాం పెరిగిన కొద్దీ మనుషుల దృష్టి వ్యవధి తగ్గుతోందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ధ్యానం, శ్వాస సాధనలు మనసును ప్రస్తుత క్షణంలో నిలిపి ఏకాగ్రతను పెంపొందించడంలో సహాయపడతాయి. యోగా అంటే కేవలం శరీరాన్ని వంచడం కాదు; మన ఆలోచనలను క్రమబద్ధీకరించే ప్రక్రియ కూడా. సామాజిక మాధ్యమాల్లో కనిపించే క్లిష్టమైన ఆసనాలను అనుకరించేందుకు ప్రయత్నించడం ప్రమాదకరం. యోగా లక్ష్యం శరీరాన్ని బలవంతంగా మలచడం కాదు; ప్రతి వ్యక్తి తన సామర్థ్యానికి అనుగుణంగా శరీరం, శ్వాస, మనస్సును సమన్వయం చేసుకోవడం. అందుకే ప్రారంభ దశలో నిపుణుల మార్గదర్శకత్వం అవసరం. ఆరోగ్య ఖర్చులు పెరుగుతున్న ఈ కాలంలో నివారణే ఉత్తమ వైద్యం. ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు యోగా కార్యక్రమాలను ప్రోత్సహిస్తే సమాజ ఆరోగ్యంపై సానుకూల ప్రభావం ఉంటుంది. పాఠశాలల్లో చిన్నారులకు ప్రాథమిక యోగా విద్య, కార్యాలయాల్లో 'వెల్‌నెస్ బ్రేక్‌లు', వృద్ధుల కోసం కమ్యూనిటీ యోగా కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు ప్రయోజనకరంగా ఉంటాయి. యోగా అనేది ఒక రోజు చేసే కార్యక్రమం కాదు; అది జీవితాంతం కొనసాగించే ఆరోగ్య సంస్కృతి. మందులపై ఆధారపడే పరిస్థితి రాకముందే శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఒక సమర్థమైన మార్గం. భారతదేశం ప్రపంచానికి అందించిన ఈ అమూల్య వారసత్వాన్ని ప్రతి కుటుంబం దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు పడతాయి.




డాక్టర్ ఎం మనోజ్ రెడ్డి
మెడికల్ ఆఫీసర్



రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.